1

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

శుక్రవారం | సెప్టెంబర్ 20, 2024 | www.navatelangana.com

డీఐఈఓ జూనియర్ కళాశాల ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం డిఐఈఓ రవీందర్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని ప్రిన్సిపాల్‌కు, అధ్యాపకులకు తెలియజేశారు. అంతేకాకుండా ఎంపీసీ, బైపిసి సెకండ్ ఇయర్ విద్యార్థులకు ప్రతి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎంసెట్ కోచింగ్ ప్రారంభమైందన్నారు. ఈ నేపథ్యంలో ఉజ్వల భవిష్యత్తు కోసం ఎంసెట్ తరగతులకు హాజరు కావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సునిల్, అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-దండేపల్లి

రుణమాఫీపై ప్రజా భవన్ ముట్టడికి వెళ్లకుండా బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, నాయకులు కాసనగొట్టు లింగన్న, అక్కల రవీందర్, అల్లం సంతోష్, గొల్ల రాజమల్లును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసేవరకు పోరాటాన్ని ఆపేది లేదన్నారు. అక్రమ అరెస్టులతో ప్రజల పక్షాన చేసే ఉద్యమాన్ని ఆపలేరన్నారు. వెంటనే ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.



పీఎఫ్ కార్యాలయం ముందు ధర్నాకు తరలిన కార్మికులు

కాగజ్‌నగర్ : కరీంనగర్‌లోని పీఎఫ్ కార్యాలయం ముందు బీఎంఎస్ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన ధర్నాకు కాగజ్‌నగర్ నుండి కార్మికులు తరలివెళ్లారు. బీఎంఎస్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సంఘటన కార్యదర్శి అన్నం రాజన్న ఆధ్వర్యంలో కార్మికులు వెళ్లి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నం రాజన్న మాట్లాడుతూ కార్మికులకు గతంలో కనీస పెన్షన్ రూ. 100లోపు మాత్రమే ఉండగా, బీఎంఎస్ పోరాటంతోనే రూ. 1000లకు పెంచినట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో పెన్షన్‌దారులు దిక్కుతోచని పరిస్థితులలో ఉన్నందున ఈ పెన్షన్‌ను రూ. 5 వేలకు పెంచాలని కోరుతూ ఈ ధర్నా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కనీస పెన్షన్ పెంచడంతో పాటు పెన్షన్‌కు డీఏ అమలు చేయాలని, పెన్షనర్లకు ఆయుష్మాన్‌భారత్ ద్వారా వైద్య సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు తరలిన వారిలో బీఎంఎస్ ఉపాధ్యక్షులు సురేష్, కార్మికులు పసుల శ్రవణ్, టి శ్రీనివాస్, రేణికుంట శంకర్, నక్క అరుణ్, కమల, సంధ్య జ్యోతి, రేఖ, లక్ష్మి ఉన్నారు.

బోధన పరంగా మెరుగుపరిచేలా రూం టూ రీడ్

అదిలాబాద్‌టౌన్ : ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థులకు బోధన పరంగా మరింత మెరుగుపరిచేలా రూం టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ పలు కార్యక్రమాలు నిర్వహిస్తుందని డీఈఓ ప్రణీత తెలిపారు. గురువారం డైట్ కళాశాలలో సంస్థ ఆధ్వర్యంలో కాంప్లెక్స్ హెచ్ఎం, ఎంఈఓ, ఎంఎన్‌లు, ఏఎంఓలకు శిక్షణ ఏర్పాటు చేశారు. డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై దీన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తు మెటీరియల్‌ను అందించారన్నారు. రూం టూ రీడ్ సంస్థ ఇచ్చే పుస్తకాల వల్ల విద్యార్థుల్లో పఠన ఆసక్తి పెరుగుతుందన్నారు. పుస్తక పఠనం కోసం ప్రత్యేక పీరియడ్ కూడా ఇచ్చామన్నారు. ఉపాధ్యాయులు వీటిని సద్వినియోగం చేసుకుంటూ నాణ్యమైన బోధనలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు సుజాత్, ఉదయశ్రీ, నారాయణ, రూమ్ టూ రీడ్ ప్రతినిధులు శ్రీకాంత్, ఉదయశ్రీ, అజిత్‌రాజ్, మహేందర్ పాల్గొన్నారు.

హిందీ ఉపాధ్యాయులందరికీ ఆన్‌డ్యూటీ సౌకర్యం

అదిలాబాద్ టౌన్ : హిందీ భాష పక్షోత్సవాలు భాగంగా హిందీ దినోత్సవ వారోత్సవ ముగింపు కార్యక్రమం 20న శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరగనుంది. దీనికి హాజరయ్యే హిందీ ఉపాధ్యాయులందరికీ ఆన్ డ్యూటీ సౌకర్యాన్ని జిల్లా విద్యాశాఖ అధికారిని ప్రణీత కల్పించినట్లు హిందీ భాషా సేవా సమితి అధ్యక్షులు సుకుమార్ పెట్కులే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని వినియోగించుకొని హిందీ పండితులంతా జాతీయ భాష హిందీ దినోత్సవం కార్యక్రమానికి తరలివచ్చి హిందీ పండితుల ఐక్యత చాటాలన్నారు. జాతీయ భాష సేవలో జిల్లా హిందీ ఉపాధ్యాయులు ముందు ఉండాలని పేర్కొన్నారు.

'పోషక పాత్ర-మన వంట అంగన్వాడీ ఇంట' పోస్టర్లు విడుదల

నిర్మల్ : 'పోషక పాత్ర-మన వంట అంగన్వాడీ ఇంట' కార్యక్రమ పోస్టర్లను గురువారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఆర్డిఓ విజయలక్ష్మి మాట్లాడారు. ప్రతి శుక్రవారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలో విధులు నిర్వహించే డిపిఎంఎస్, ఏపీఎంఎస్, సిసిఎస్, బిఓఏలు తమ ఇంటి వద్ద నుంచి పౌష్టికాలతో కూడిన ఆహారాన్ని వండి జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలలోని విద్యార్థులకు అందించి చిన్నారుల్లో పౌష్టికాహార లోపం నిర్మూలనే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, బ్యాంకు అధికారులు, డిఆర్డిఓ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు టాస్క్‌పై శిక్షణ

కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు గురువారం తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టాస్క్ ఫ్యాకల్టీ సభ్యుడు జి సాయికుమార్ విద్యార్థులకు శిక్షణ ఇవ్వడమే కాకుండా దాని ప్రాధాన్యత గురించి వివరించారు. భవిష్యత్తులో ఈ శిక్షణ వల్ల కలిగే లాభాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ కె శ్రీదేవి విద్యార్థులకు మార్గనిర్దేశనం చేశారు. విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో మంచి స్థాయిలో నిలువాలని సూచించారు. అనంతరం ఫ్యాకల్టీ సాయికుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టాస్క్ కో ఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ, అధ్యాపకులు పాల్గొన్నారు.

మిలాద్ ఉన్ నబీ ర్యాలీ

తాండూర్ : మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజును మండల ముస్లిములు ఘనంగా నిర్వహించారు. మైనార్టీ యువకుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గురువారం ఉదయం తాండూర్ జామా మసీద్ నుండి ప్రారంభమైన ర్యాలీ తాండూరు వీధుల గుండా ఐబీ తంగళ్లపల్లి మసీద్ మినార్ వరకు సాగింది. సీఐ కుమారస్వామి ఆధ్వర్యంలో ఎస్సై కిరణ్ కుమార్, అనూష అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలి

కాగజ్‌నగర్ : వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం-2016 ప్రకారం వికలాంగులకు ప్రభుత్వ పథకాలలో ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సి ఉండగా, తెలంగాణ ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) - 2024 పాలసీలో ఈ రిజర్వేషన్ గురించి ప్రస్తావనే లేదని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జిల్లా అధ్యక్షులు పందు రాజేష్, కార్యదర్శి ముంజం ఆనంద్‌కుమార్, కోశాధికారి గౌత్రె రాజు, ఉపాధ్యక్షులు సప్తగిరి రెడ్డి, సహాయ కార్యదర్శి జాడి పాలక్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈ పాలసీలో ఎస్సీలకు 14.94, ఎస్టీలకు 8.75, ఓబీసీలకు 27.69 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం వికలాంగులకు కేటాయించాల్సిన ఐదు శాతం గురించి ఎందుకు ప్రకటించలేదని వారు ప్రశ్నించారు. రాష్ట్రంలో 43.02 లక్షల మంది వికలాంగులు ఉన్నారని, పరిశ్రమల ఏర్పాటులో కూడా వీరికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందని వారు పేర్కొన్నారు. చట్టాలను అమలు చేయాల్సిన ప్రభుత్వమే వాటిని ఉల్లంఘించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎంఎస్ఎంఈ-2024 పాలసీని సవరణ చేసి వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

క్రైస్తవం గురించి పుస్తక ప్రదర్శన

అదిలాబాద్‌టౌన్: క్రైస్తవం గురించి తెలుసుకోవడానికి పుస్తక ప్రదర్శన ఎంతో ఉపయోగపడుతుందని సీఎస్ఐ సెంట్ పీటర్ చర్చ్ ప్రెస్ బైటర్ ఇన్చార్జి రేవరెండ్ వీ.శ్యామూల్ అన్నారు. బ్యూటిఫుల్ బుక్ సెంటర్ చెన్నై ఆధ్వర్యంలో స్థానిక టీఎన్జీవోస్ భవనంలో క్రైస్తవ మత గ్రంథాల పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రదర్శనను ప్రారంభించి పుస్తకాలను పరిశీలించారు. క్రైస్తవం గురించి, బైబిల్‌లోని సారాంశాలను తెలియజేస్తూ ఎంతో మంది రచించిన పుస్తకాలు ఇక్కడ ప్రదర్శనలో ఉన్నాయని తెలిపారు. బైబిల్‌తో పాటు ఇతర రకాల పుస్తకాలు కూడా ఇక్కడ పెట్టారని, ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ నెల 23 వరకు ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యునైటెడ్ ఫాదర్స్ ఫెల్లోషిప్ అధ్యక్షుడు రాకేష్, లెమెన్స్ ఈవానీల్కేర్ ఫెల్లోషిప్ ప్రతినిధులు బ్రదర్ సురేష్, ఇనోక్, సంతోష్ కుమార్, క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యాముల్ సంపత్, ఆర్గనైజర్ పాల్ ఉన్నారు.

వంద శాతం అక్షరాస్యతకు చర్యలు చేపట్టాలి

- నిర్మల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలో వంద శాతం అక్షరాస్యత సాధించేలా చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమం అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వంద శాతం అక్షరాస్యత సాధించేలా, నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్షరాస్యత శాతం 57.77 కాగా రాష్ట్రంలోనే జిల్లా 27 స్థానంలో ఉందని తెలిపారు. మండలాల వారీగా జిల్లాలో 13,563 మందిని నిరక్షరాస్యులుగా గుర్తించడం జరిగిందని తెలిపారు. అక్షరాస్యతతో పాటు ఆర్థిక అక్షరాస్యత, వాణిజ్య నైపుణ్యాలు, ఆరోగ్య సంరక్షణ, అవగాహన, శిశు సంరక్షణ, విద్య, కుటుంబ సంక్షేమం, సమాజ శ్రేయస్సు, పర్యావరణ, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. వృత్తి నైపుణ్యాలు, సంపాదన, జీవన పరిస్థితులను మెరుగుపరచడానికి సంబంధిత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. విద్య, వైద్యం, పంచాయతీ, ఆరోగ్యశాఖ ఎంపీడీవోలు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో గోవింద్, డిఈఓ రవీందర్‌రెడ్డి, డిఎంహెచ్ఓ డాక్టర్ రాజేందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, లైజన్ అధికారి బిఎస్ మూర్తి, మున్సిపల్ కమిషనర్ రాజు, మెప్మా పీడీ సుభాష్, అధికారులు పాల్గొన్నారు.

సేకరించిన భూమికి మార్కెట్ ధర ఇవ్వాలని

కలెక్టరేట్ ఎదుట భూనిర్వాసితుల ధర్నా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ కోసం భూములు సేకరిస్తున్న అధికారులు మార్కెట్ ధర ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు లంక రాఘవులు డిమాండ్ చేశారు. రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ భూనిర్వాసితులు, యాపల్‌గూడ రైతులు గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వీరికి సీపీఐ(ఎం) నాయకులు మద్దతు తెలిపారు. అధికారులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా లంక రాఘవులు మాట్లాడుతూ గతంలో ఫ్యాక్టరీ కోసం రాంపూర్, రామాయి, యాపల్‌గూడ రైతులు భూములు ఇచ్చారని, వారు ఇప్పుడు కూలీలుగా మారారని తెలిపారు. ఇంకా భూములు కావాలని ఆర్డీఓ నోటీసులు ఇచ్చారని, తక్కువ ధరకు భూములు తీసుకునే యత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం అక్కడ మార్కెట్ ధర ఎకరానికి రూ.30 నుంచి రూ.40లక్షలు పలుకుతోందన్నారు. దీని ఆధారంగానే గ్రామ సభలు నిర్వహించి ధర ఇవ్వాలన్నారు. లేదా భూములకు బదులు వేరే చోట భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నిర్వాసితులు రమేష్, రాజన్న, సాయి, స్వామి, రవి, సంతోష్ పాల్గొన్నారు.

పంజేషా కాలనీలో భారీ చోరీ


- బంగారం, వెండి, నగదు, వస్తువులు మాయం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంట్లో వ్యక్తులు లేని సమయం చూసి దొంగలు చొరబడి 13 తులాల బంగారంతో పాటు రూ.50వేల నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన పట్టణంలోని పంజేషాలోని ఓ ఇంట్లో చోటుచేసుకుంది. బాధితురాలు సవిత తెలిపిన వివరాల ప్రకారం...మూడు రోజుల క్రితం ఆస్పత్రి పని మీద హైదరాబాద్‌కు వెళ్లారు. గురువారం ఉదయం తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగళగొట్టి ఉండడంతో షాక్ అయ్యారు. ఇంట్లోని వస్తువులు చిందరవందర పడి ఉండడం గమనించారు. బెడ్ రూంలోని బీరువాలోని బట్టలు బయటపడేసి ఉన్నాయి. ఇంట్లో ఉన్న 13 తులాల బంగారం, అర కేజీ వెండి, రూ.50వేల నగదుతో పాటు 60 ఈంచుల సోని టీవీని ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ విషయం గురించి వెంటనే పోలీసులకు సమాచారం తెలియజేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

పౌరసరఫరాల శాఖ అధికారుల దాడులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డోమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను కమర్షియల్‌గా వినియోగిస్తున్నారన్న ఫిర్యాదుల మేరకు పౌరసరఫరాల శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. గురువారం పట్టణంలోని పలు హోటళ్లలో తనిఖీ చేయగా కమర్షియల్ గ్యాస్ కాకుండా ఇంట్లో వినియోగించే గ్యాస్‌ను వినియోగిస్తున్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుంటూ యాజమనులకు హెచ్చరికలు జారీ చేశారు. కమర్షియల్ కాకుండా డోమెస్టిక్ సిలిండర్లను వాడితే చర్యలు తప్పవని డీఎస్ఓ జావీద్ అలీ హెచ్చరించారు. ఇండ్లకోసం వినియోగించే గ్యాస్ సిలిండర్లను హోటళ్లలో వినియోగిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీ చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ బాబుసింగ్ తెలిపారు. పలు హోటళ్లలో తనిఖీ చేసి 22కు పైగా పట్టుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాటిని గోదాంకు తరలించామన్నారు. వారం రోజుల్లో యజమానులకు నోటీసులు అదించి వివరణ తీసుకొని చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు నారాయణ, ప్రేంనివాస్, మధుసూదన్, రామారావ్, విశ్వనాథ్, యూడీఆర్ఏ రవీందర్ ఉన్నారు.

ముల్కల్ల శివారులో మెప్మా ఉద్యోగి బలవన్మరణం

నవతెలంగాణ-హాజీపూర్



మండలంలోని ముల్కల్ల శివారులో మంచిర్యాల మున్సిపాలిటీలోని మెప్మా కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఇండ్ల రమేశ్(48) బలవన్మరణానికి పాల్పడ్డాడు. బంధువులు, సన్నిహితులు తెలిపిన వివరాల ప్రకారం..లక్షెట్టిపేట మండలం వెంకటరావుపేట గ్రామానికి చెందిన రమేశ్ మంచిర్యాలలోని రాంనగర్‌లో నివాసముంటూ మెప్మా పీడీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్(డాటా ఎంట్రీ ఆపరేటర్)గా పని చేస్తున్నాడు. నెల రోజులుగా మానసిక పరిస్థితి బాగ లేకపోవడంతో విధులకు సక్రమంగా హాజరు కావడం లేదు. ఇటీవల ఇంటికి కూడా రాకపోవడం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కొంత సమయానికి ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. రెండు రోజుల నుంచి విధులకు హాజరుకాని రమేశ్ గురువారం ముల్కల్ల శివారులోని కల్వర్టు వద్ద గల దుర్గామాత ఆలయం వద్ద పురుగులమందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు కుటుంబ సభ్యులకు తెలిసి సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా విగత జీవిగా కనిపించడంతో వారి రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య శిరీషా, కుమార్తె ఉన్నారు.

ఔషధాలపై అవగాహన



నవతెలంగాణ-మంచిర్యాల

నిత్యం ప్రజలు ఏదో ఒక జబ్బుకు ఉపయోగించే మందులపై అవగాహన కార్యక్రమాలు 7రోజులు నిర్వహించనున్నట్లు ఫార్మకాలజి ప్రొఫెసర్ జగతి తెలియజేశారు. గురువారం మెడికల్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో విద్యార్థులతో మందులు వాడకంతో జరిగే రియాక్షన్స్, ప్రయోజనాలపై నాటిక ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జగతి మాట్లాడుతూ వారం రోజులు మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో నేషనల్ ఫార్మకాలజి విజిలెన్స్ వీక్ సెలెబ్రేషన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ వల్లే వచ్చే సైడ్ ఎఫెక్ట్ గురించి సంబంధిత వైద్యులను సంప్రదిస్తే మెడికల్ కళాశాలకు రెఫర్ చేస్తారని తెలిపారు. దాన్ని ఢిల్లీలో ఉన్న గజియాబాద్ ల్యాబోరేటరీకి పంపించి పరీక్షించిన డ్రగ్‌తో వచ్చే అనర్థాలపై పూర్తి సమాచారం తెలిజేయజేస్తామన్నారు. ఇప్పటి నుండి మందుల వాడకంలో పేషెంట్స్‌కు ఏదైన సైడ్ ఎఫెక్ట్ వస్తే అందుబాటులో ఉన్న వైద్యులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సులేమాన్, ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్ హరీష్ చంద్రారెడ్డి, ఫార్మకాలజి డిపార్ట్మెంట్ వైద్యులు డాక్టర్ మనోజ్, పలువురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

మహాలక్ష్మి స్కీం బకాయిలు నెలనెలా చెల్లించాలని

డిపో ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, మహాలక్ష్మి స్కీం బకాయిలు నెలనెలా చెల్లించాలని, సరిపడా నూతన బస్సు సర్వీసులను పెంచాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఉదయం ఆర్టీసీ డిపో ఎదుట రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహాలక్ష్మి స్కీంతో ఎన్నో ఇబ్బందులు ఎదురైనా విజయవంతం చేస్తున్నామన్నారు. కాని ఆ స్కీం ద్వారా కార్మికులకు ఎదురౌతున్న ఇబ్బందులను పరిష్కరించడంలో యాజమాన్యం, ప్రభుత్వం ఎన్ని సార్లు విన్నవించినా పరిష్కరించడం లేదన్నారు. కార్మిక ఉద్యమమంపై ఆంక్షలు ఎత్తివేయాలని, కార్మికులు ఏర్పరచుకున్న భవిష్యనిధి, సహకార సంఘాల డబ్బులను చెల్లించాలని కోరారు. పని భారం తగించాలని, కార్మికులపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మిట్టపెల్లి భీంరావ్, రీజియన్ అధ్యక్షుడు యస్.భీంరావ్, డిపో కార్యదర్శి యం. ఆశన్న, దత్తు, అశోక్, గంగన్న పాల్గొన్నారు.

టిప్పర్ కింద పడి యువకుడి మృతి





నవతెలంగాణ-తలమడుగు

మందగూడ గ్రామానికి చెందిన మెస్రం మహేందర్(23) గురువారం టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..డోర్లి నుండి కప్పర్‌దేవి వరకు జరుగుతున్న రోడ్డు పనులకు టిప్పర్(టీఎస్01యుసి3788) కంకర లోడ్‌తో వెళ్లింది. యువకుడు టిప్పర్ వెనకాల వెళ్లగా డ్రైవర్ గమనించకపోవడంతో మోటార్ సైకిల్‌తో పాటు మహేందర్ టిప్పర్ చక్రాల మధ్య ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మహేందర్ జిల్లా కేంద్రం నుండి పత్తి పంటకు స్ప్రే మందులు తీసుకొని వెళ్తూ మందగూడ-కప్పర్‌దేవి ఎక్స్ రోడ్ సమీపంలో ప్రమాదానికి గురయ్యాడు. యువకుడు డిగ్రీ వరకు చదివి చేను పనుల్లో తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. టిప్పర్ చక్రాల మధ్య ఇరుక్కుపోయిన మహేందర్ మృతదేహాన్ని, మోటార్ సైకిల్‌ను జాకులు అమర్చి బయటకు తీశారు. టిప్పర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. రూరల్ సిఐ పణీంద్ర, ఎస్సై అంజమ్మ, మాజీ జెడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేసి పెండింగ్ బిల్లులు అన్ని ఏకకాలంలో చెల్లించాలని, పిఆర్సిని ప్రకటించాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వలభోజు గోపిక్రిష్ణ డిమాండ్ చేశారు. గురువారం గుడిహత్నూర్‌లో నిర్వహించిన మండల తపస్ సభ్యత్వ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పలు పాఠశాలలో పర్యటిస్తూ సభ్యత్వం చేపట్టారు. ఈ సందర్భంగా గోపిక్రిష్ణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలో ముఖ్యమైన సీపీఎస్‌ను రద్దుచేసి ఓపిఎస్‌ను అమలు చేయాలని అన్నారు. ఆదర్శ పాఠశాల టీచర్లకు బదిలీలతో పాటు ప్రమోషన్లు చేపట్టాలని తెలిపారు. కెజిబివి టీచర్లకు, సిబ్బందికి కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిపిఎఫ్, మెడికల్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ ఆర్థిక సహ కార్యదర్శి మెస్రం రాజ్‌కుమార్, గౌరవ అధ్యక్షులు ధరమ్‌సోత్ అంబాజీ, జాదవ్ సురేష్, ఆడే వసంత్‌రావ్ పాల్గొన్నారు.

పెద్దనపల్లిలోనే ఓటు హక్కు కొనసాగించాలి



నవతెలంగాణ - కాసిపేట

తమ ఓటు హక్కును పెద్దనపల్లి గ్రామ పంచాయతీలోనే కొనసాగించాలని 65 మంది ఓటర్లు అన్ని రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీవోను కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేసి ఆర్థిక స్థోమత లేని కొన్ని కుటుంబాలు పక్క గ్రామ పంచాయతీలో కిరాయి ఇండ్లలో ఉంటున్నారని తెలిపారు. ఈ క్రమంలో సోమగూడెం(కె) గ్రామ పంచాయతీలో ఉంటున్న 65మంది ఓటర్లను అదే గ్రామ పంచాయతీలో ఓటర్లుగా నమోదు చేశారన్నారు. భవిష్యత్తులో పెద్దనపల్లి గ్రామంలోనే ఉంటామని ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంపీవో సబ్దర్ అలీలను కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

గడ్డెన్నవాగు ప్రాజెక్ట్ నీటి విడుదల



నవతెలంగాణ-భైంసా

గడ్డెన్నవాగు ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా నీటిని గురువారం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండటంతో సాగునీటి కోసం నీటిని విడుదల చేసినట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సారి రబీ సీజన్‌లో పదివేల ఎకరాలకు సాగునీరు అందించడం లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ప్రధాన కాలువ మరమ్మత్తులు, ఇతరత్రా వాటికోసం ప్రభుత్వం నుంచి నిధులు తెప్పిస్తానన్నారు. నియోజకవర్గంలో రైతాంగానికి మరింత సాగు అందించడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో గడ్డెన్నవాగు ప్రాజెక్ట్ డీఈ అనిల్, ఏఈ శ్రీకాంత్, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, బీజేపీ పట్టణాధ్యక్షులు మల్లేష్, సీనియర్ నాయకులు సొలంకి భీంరావు, రమేష్, నాయకులు రావుల పోశెట్టి, దిలీప్, వడ్నప్ శ్రీనివాస్, గట్టు ప్రవీణ్, రాము, తానూర్ మండల నాయకులు శివాజీ పటేల్ పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లా ఎస్పీకి ఘన సన్మానం

నవతెలంగాణ-ముధోల్

ముధోల్ హిందు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిలను ఎస్పీ కార్యాలయంలో కలిసి ఘనంగా సన్మానించారు. ముధోల్ గణేష్ నిమజ్జనానికి గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి, ప్రశాంతంగా నిర్వహించినందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. అలాగే భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, భైంసాటౌన్ సీఐ రాజారెడ్డిని కలిసి ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. బందోబస్తులో పాలు పంచుకున్న పోలీసులకు ఈసందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. గణేష్ నిమజ్జన ఉత్సవాల సందర్భంగా పోలీసులకు సహకరించిన ఉత్సవకమిటీ అధ్యక్షుడు రోళ్ల రమేష్‌ను, సభ్యులను, గణేష్ మండలి నిర్వాహకులను ఈసందర్భంగా ఎస్పీ, అడిషనల్ ఎస్పీలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ముధోల్ హిందూ ఉత్సవ కమిటి అధ్యక్షులు రోళ్ల రమేష్, గౌరవాధ్యక్షులు ధర్మపురి సుదర్శన్, వీడీసీ అధ్యక్షులు గుంజల నారాయణ, కోశాధికారి మేత్రి సాయినాథ్, ఉపాధ్యక్షులు వరగంటి జీవన్, తాటివార్ రమేష్, కోరి పోతన్న, సంయుక్త కార్యదర్శులు దేవోజీ భూమేష్, మోహన్, కార్యవర్గ సభ్యులు జంబూల సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఉట్నూర్

టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో కేంద్ర మంత్రి రవనీత్ సింగ్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ కేంద్రంలో గాడ్సే ప్రభుత్వం ఉందని అన్నారు. కుల మతాల మధ్య చిచ్చు పెట్టి దేశంలో అల్లకల్లోలం సృష్టించడానికి బీజేపీ నిరంతరం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనాయకుడు, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తల తెచ్చిన వారికీ రివార్డు ఇస్తామని కేంద్ర మంత్రి రవనీత్ సింగ్ బిట్టు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. అనంతరం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, సీఎం రేవంత్‌రెడ్డిపై విచ్చల విడిగా మాట్లాడుతూ నోరు పారేసుకుంటే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పేదల కోసం పని చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ ప్రభాకర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యుం, ఇంద్రవెల్లి మండలాధ్యక్షులు ముఖాడే ఉత్తం, బ్లాక్ అధ్యక్షులు ఇక్బాల్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దూట రాజేశ్వర్, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు అచ్చ దేవానందం, టీపీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మోబిన్, మాజీ సర్పంచ్‌లు ఆత్రం రాహుల్, పెందూర్ కళావతి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బిరుదుల లాజర్, సయ్యద్ నిసార్ పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును రద్దు చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ క్రిమిలేయర్‌పైన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మెన్ వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణలతో ఎస్సీ, ఎస్టీల అందరికి నష్టం వాటిల్లుతుందని అన్నారు. వెంటనే రద్దు చేయాలని, రాష్ట్ర మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి రద్దు చేసేలా డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ మేరకు ఈనెల 30న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో దళిత బహుజన పార్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు గవ్వల శ్రీకాంత్, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ అడ్వొకేట్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పసుల రాజలింగం, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ అడ్వొకేట్స్ ఫోరం నిర్మల్ జిల్లా అధ్యక్షులు ఆర్ రత్నంరావు పాల్గొన్నారు.

తెలంగాణ బంద్ విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

జైనూర్ మండలంలోని ఆదివాసీ మహిళపై లైంగికదాడి చేసి హత్య చేయడానికి ప్రయత్నించిన నిందితుడిని శిక్షించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న దానికి నిరసనగా ఈ నెల 21న తెలంగాణ బంద్ పాటించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావు అన్నారు. గురువారం ప్రెస్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీ మహిళకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని అన్నారు. కుల, మతాలకు అతీతంగా బంద్‌లో పాల్గొని సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆదిలాబాద్ బ్లాక్ కుమ్ర జైతు, జిల్లా నాయకులు అర్క ఓమేష్, సెడ్మకి వినోద్, పూసం ఇస్రు, సంతోష్ ఉన్నారు.

రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం డీఎల్‌పీఓ బానవత్ సుదర్శన్ పాటిల్, ఎంపీడీఓ శివకుమార్‌లు ఓటరు జాబితాపై వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సమావేశం నిర్వహించి, ఓటరు ముసాయిదా జాబితపై మాట్లాడారు. జాబితాలో ఏమైనా మార్పులు, తప్పులుంటే అభ్యంతరాలు తెలుపాలని సూచించారు. మండలంలో 19 గ్రామ పంచాయతీలకు గాను, 166 వార్డులు గాను, 28, 046 ఓటర్లు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ బందారి గంగాధర్, కాంగ్రెస్ మండల ఇన్‌చార్జీ రావుల గంగారెడ్డి, బీజేపీ నాయకులు ఎస్.పోతన్న, డి.శ్రీనివాస్, బీఎస్పీ మండల నాయకులు ఎస్.సునీల్ కుమార్, సీపీఐ(ఎం) వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు గంధం లింగన్న పాల్గొన్నారు.



తల్లీబిడ్డలకు..
సంపూర్ణ పోషకాహారాన్ని అందించాలి



నవతెలంగాణ-నిర్మల్

పోషణ్ అభియాన్ కార్యక్రమంలో తల్లి, బిడ్డలకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ భవనంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పోషణ్ అభియాన్ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఆమె పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ఈ నెల ఒకటి నుంచి 30 వరకు నిర్వహిస్తున్న జాతీయ పోషణ మాసంలో సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి పోషణ, పోషకాహారం, శుద్ధమైన తాగునీరు, పరిశుభ్రతపై వివరించాలన్నారు. జిల్లాలోని 926 అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ అభియాన్ కార్యక్రమం పక్కాగా అమలు చేయాలని, తల్లి, బిడ్డల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రతిరోజు గర్భిణులకు, బాలింతలు, పిల్లలకు పాలు, గుడ్లు, పోషక విలువలు కలిగిన హారాన్ని అందించాలన్నారు. అంగన్‌వాడీ, ఆశ, వైద్య సిబ్బంది సమన్వయంతో గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, పోషణ, ఆరోగ్య శుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. పోషణ లోపం కలిగిన పిల్లలను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి చిన్నారి వయసుకు తగిన బరువు, ఎత్తు ఉండేలా పోషక ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ జాతీయ పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు, అంగన్‌వాడీ సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. తల్లి, బిడ్డల సంపూర్ణ ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మహిళా, శిశు సంక్షేమం, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ తల్లీబిడ్డల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో కిచెన్ గార్డెన్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ, వైద్య శాఖ సిబ్బందిచే కలెక్టర్ పోషణ అభియాన్ కార్యక్రమం అమలుపై ప్రతిజ్ఞ చేయించారు. అలాగే గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు వివిధ అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది ప్రదర్శించిన పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను క పరిశీలించారు. కార్యక్రమంలో సీడీపీఓ నాగలక్ష్మి, వైద్యులు నయన రెడ్డి, సౌమ్య, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, అధికారులు, కౌన్సిలర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, మహిళలు పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రల సమస్యలు పరిష్కరించాలి

- సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తాం
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 17 సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు సేవలు అందిస్తున్న ఆరోగ్య మిత్రల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. గురువారం ఆరోగ్య మిత్రులతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్యామలదేవిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఐటీయూ ఆరోగ్యమిత్ర రాష్ట్ర నాయకత్వంతో వెంటనే చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడానికి కార్యచరణ రూపొందించాలని లేనిపక్షంలో సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మెను కొనసాగిస్తామని అన్నారు. గత 17 సంవత్సరాలుగా ఆరోగ్య మిత్రలు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్నారని, కనీస వేతనాలు ఉద్యోగ భద్రత లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలను పరిష్కరించాలని అనేక సందర్భాల్లో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్పందన లేదన్నారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించక ఆరోగ్య మిత్రులు సమ్మెబాట పట్టే పరిస్థితిని కల్పించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా ఆరోగ్య మిత్రుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే దిశగా కార్యచరణ రూపొందించాలని, ఆరోగ్య మిత్రులను డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 60 ప్రకారం వేతనం రూ. 22వేల 750 ఇవ్వాలని, ఆరోగ్య మిత్రుల వేతనాలు అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కాకుండా ట్రస్టు ద్వారా చెల్లించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, టీఏడీఏ సౌకర్యాలు కల్పించాలన్నారు. అలాగే విధి నిర్వహణలో మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ఉద్యోగులందరికీ హెల్త్ కార్డు సౌకర్యాలు కల్పించాలని, సమస్యలు పరిష్కరించని నేపథ్యంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి నవీన్ కుమార్, ఆరోగ్య మిత్రా జిల్లా నాయకులు శ్రీనివాస్, విశ్వనాథ్, భీంరావు, అనిత, సుజాత, గంగామణి పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లు, మూడు నేర చట్టాలను రద్దు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నాలుగు లేబర్ కోడ్‌లు, మూడు నేర చట్టాలను రద్దు చేయాలని ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకట్‌నారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 30న ఛలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ధర్నాను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గురువారం ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐఎఫ్టీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు, నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు, మూడు నేర చట్టాలను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన బొగ్గు గనులు, రైల్వే, ఎల్ఐసీ, టెలికాం, బీఎస్ఎన్ఎల్ తదితర వాటన్నింటిని ప్రయివేట్ పరం చేయడం, అమ్మివేయడాన్ని తక్షణమే ఆపాలన్నారు. కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్, స్కీం వర్కర్‌లు కేజీబీవీ, అంగన్‌వాడీ, ఆశా తదితరులను పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని అన్నారు. హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. భవన ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వెల్ఫేర్ బోర్డును ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పడాన్ని వ్యతిరేకిస్తూ, బీడీ కార్మికులకు కనీస వేతన జీఓతో పాటు, పెండింగ్‌లో ఉన్న 73 షెడ్యూల్డ్ రంగాలకు సంబంధించిన జీఓలను పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విడుదల చేయాలన్నారు. అలాగే కార్మిక వర్గం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ, హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ధర్నాను ఏర్పాటు చేయడం జరిగిందని ఈ ధర్నాలో అన్ని వర్గాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు గౌరాల సుభాష్, శేషరావు, నర్సింగ్, దేవిదాస్, జనార్దన్, ప్రసాద్, కైసర్, గణేష్, రమాకాంత్, సంతోష్, ప్రదీప్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన బియ్యాన్ని పరిశీలించిన డీసీఎస్ఓ

నవతెలంగాణ-బోథ్

మండలంలోని కౌట(కె) గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆదిలాబాద్ సివిల్ సప్లై, బోథ్ ప్రత్యేకాధికారి వాజిద్ అలీ మధ్యాహ్న భోజన పథకం బియ్యాన్ని పరిశీలించారు. పాఠశాలలోని మధ్యాహ్న భోజనం పథకం బియ్యం నాణ్యతగా రాలేదని, ప్రధానోపాధ్యాయురాలు జిల్లా సివిల్ సప్లై అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన గురువారం కౌట(కె) గ్రామంలోని పాఠశాలలో మధ్యాహ్న భోజనం బియ్యాన్ని పరిశీలించారు. ముక్కిపోయిన బియ్యం నాణ్యత లేకపోవడంతో ఈ బియ్యాన్ని విద్యార్థులకు పెట్టకూడదని సూచించారు. వెంటనే ఈ బియ్యాన్ని బోథ్ ఎమ్ఎల్ఎస్ పాయింట్‌కు తరలించి, నాణ్యత గల బియ్యాన్ని పంపిణీ చేస్తానని తెలిపారు. అనంతరం పాఠశాలలోని పారిశుధ్యం, మరుగుదొడ్లు పరిశీలించారు. పాఠశాలలో మౌలిక వసతులు, మంచినీటి సౌకర్యం, పారిశుధ్య లోపం ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాదవ్ రామారావు, ప్రధానోపాధ్యాయురాలు పుష్పల, ఉపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆశ్రమాల్లో మెరుగైన విద్యనందించాలి

- ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆశ్రమాల్లో చదువుకునే విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం ఆశ్రమ పాఠశాల జండ, ఇంద్రవెల్లిని పీఓ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల అటెండెన్స్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలనీ అన్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజు వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు భోదించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఔషధాల రిజిస్టర్ పరిశీలించి, ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఏమైనా మరమ్మతులు ఉంటే తమకి తెలియజేయాలనీ అన్నారు. వర్షాల నేపథ్యంలో దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాలలో వర్షపు నీరు నిలువకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాలలో బోస్ ఫెలోషిప్ కార్యక్రమం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో గురువారం భారత్ దేఖో, ఐటీడీఏ ఉట్నూర్ వారి ఆధ్వర్యంలో బోస్ ఫెలోషిప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అతిక్ బేగం పాల్గొని అధ్యక్షత వహించారు. విద్యార్థులు కూడా నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కార్యక్రమం నిర్వాహకులు అభిజిత్ మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక సేవ కలిగి ఉండాలని అన్నారు. చుట్టుపక్కల వారిపై సేవా భావాన్ని కలిగి ఉండాలని తెలియజేశారు. శిక్షకురాలు కుమారి మాట్లాడుతూ ఈ కార్యక్రమం నాలుగు రోజుల పాటు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాజానికి సంబంధించిన వివిధ అంశాలు నేర్పబడుతాయని తెలియజేశారు. విద్యార్థులు దీనికి హాజరై తమ విలువలను పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు చంద్రకాంత్, గోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంతో అధిక లాభాలు

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు, నిరుద్యోగులకు పెరటి కోళ్ల పెంపకంతో ఉపాధితో పాటు ఆదాయం లభిస్తుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కల్లూరుగూడ గ్రామంలో భావ్యపమం కోళ్ల పరిశోధన సంచనాలయం హైదరాబాద్ వారిచే 360 పెరటి కోళ్లు, 100 ఇనుముతో తయారు చేసిన ఇండ్లను పంపిణీ చేశారు. ముందుగా సంస్థ శాస్త్రవేత్తలు పెరటి కోళ్ల పెంపకంపై, వాటి పెంపకం వల్ల కలిగే లాభాల గురించి, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెరటి కోళ్లను పెంపకంతో అధిక లాభాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కోళ్లు అధిక బరువు కలిగి ఉంటాయని, దీంతో పాటు అధిక మాంసం, గుడ్లనిస్తాయన్నారు. స్వయం ఉపాధి పొందేందుకు సర్కార్ వారు పెరటి కోళ్ల పెంపకంలో శిక్షణ ఇస్తారని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అందులో వానరాజా, రాజశ్రీ, శ్రీనిధి ఇలా పలు రకాల కోళ్లు ఉంటాయని పేర్కొన్నారు. నాటు కోళ్లతో పోల్చితే పెరటి కోళ్లు అతి తక్కువ రోజులో పెరుగుతాయన్నారు. నిరుద్యోగ యువత, రైతులు పెరటి కోళ్ల పెంపకంపై దృష్టి సారించి, స్వయం ఉపాధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సైంటిస్టు, డా.బి.ప్రకాష్, డా.రాజకుమార్, డా.విజయ్ కుమార్, టెక్నికల్ ఆఫీసర్ ఎస్కే బాంజా, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ భార్గవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిషాన్ ఘాట్ ప్రజలకు కరెంట్ సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని నిషాన్ ఘాట్ ప్రజలకు కరెంట్ సౌకర్యం కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం విద్యుత్‌శాఖ ఎస్ఈ జేఆర్ చావాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 38 సర్వే నెంబర్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలు దాదాపు 300 మంది నివాసం గడుపుతున్నారని అన్నారు. గత 12 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్నా, నేటి వరకు కరెంటు లేక చీకటిమయంలో బిక్కుబిక్కుమ అనుకుంటూ బతుకులు వెళ్లదీస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు షేక్ పాషా, అర్ధాంగి రమేష్, బెజ్జంకి నర్సింగరావు పాల్గొన్నారు.

ఓటరు ముసాయిదాపై సమావేశం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో విడుదల చేసిన ఓటర్ ముసాయిదా జాబితాపై మండలంలోని వివిధ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీఓ శ్రీనివాస్ తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల వార్డుల వారీగా ఓటరు జాబితా అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. దీనిపై అభ్యంతరాలుంటే ఈనెల 21లోపు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల ప్రతినిధులు జీవన్, ఆత్మారాం, మురళి పాల్గొన్నారు.

సేవా పక్వాడాలో భాగంగా రక్తదాన శిబిరం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జన్మదిన సేవ పక్వాడలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో బీజేపీ సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా సిర్పూర్ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోడీ జన్మదినం సందర్భంగా వచ్చేనెల రెండు వరకు వివిధ రకాల సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.చెన్నకేశవ రావు, డా.హర్షవర్ధన్, డా కృష్ణ, డా.నవీద్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, బీజేవైఎం సుచిత్, జిల్లా కోశాధికారి అరుణ్ లోయ, అసెంబ్లీ కన్వీనర్లు గొల్లపల్లి వీరభద్రచారి, సొల్లు లక్ష్మి, సిద్ధంశెట్టి సుహాసిని, సౌరభ్ ధాత్రక్, కొండ తిరుపతి, బీజేపీ సీనియర్ నాయకుడు ప్రసాద్ గౌడ్, శ్రీకాంత్, ఆచార్య రాధిక్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ. 2లక్షల ఆస్తి నష్టం
- పరామర్శించిన ఎమ్మెల్సీ విఠల్



నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలోని గుమ్మల శ్రీనివాస్ ఇంట్లో బుధవారం రాత్రి ఫ్రిజ్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇల్లు దగ్ధమై ఇంట్లోని సామాగ్రి పూర్తిగా కాలిపోయాయి. మంటలు చెల్లరేగడంతో వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఎలాంటి అపాయం జరగలేదు. విద్యుత్ అధికారులు అక్కడికి చేరుకొని ఇంట్లో విద్యుత్ తీగలను తొలగించారు. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు ఇంట్లో నుండి వెంటనే పరుగులు పెట్టారు. ఇంట్లో సామాగ్రి పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ. రెండు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగింది. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. విషయం తెలుసుకున్న ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ. 10000 ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యుడు హర్షద్ హుస్సేన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజకొండ శ్రీవర్ధన్, కాంగ్రెస్ నాయకులు జావిద్ అలీ, సురేష్ గౌడ్, పెద్దల శంకర్, కుమ్మరి పోశం ఉన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దు



నవతెలంగాణ-సిర్పూర్

నేటి ఆధునిక యుగంలో గ్రామీణ ప్రాంతాలలో నిరక్షరాశ్యులు తమ ఆడపిల్లలు కుటుంబాలకు భారామని బాల్య దశలోనే వివాహాలను చేస్తున్నారని, వీటిని రూపుమాపాలంటే కేవలం అక్షరాస్యతతోనే సాధ్యమవుతుందని షర్ ఆర్గనైజర్ కోఆర్డినేటర్ ఎస్.రంజిత్ అన్నారు. గురువారం బాల్య వివాహాలపై మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సాంకేతిక విద్య దినదినం అభివృద్ధి చెందిన గ్రామీణ ప్రాంతాలలో బాల్య వివాహాలు చేస్తున్నారని, చిన్న వయసులో ఆడపిల్లలకు వివాహం చేయడం వలన మానసికంగా, శారీరకంగా కృంగిపోతున్నారని, కొంతమంది యువతీలు కుటుంబంలో చిన్నచిన్న మనస్పర్థాలకు చింతించి ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. చదువు లేకపోవడమే ప్రధాన కారణమని, దీన్ని భవిష్యత్తులో రూపుమాపాలంటే నేటి యువతీ, యువకులపైన ఆధారపడి ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో బాల్య వివాహాలు అరికట్టడమే లక్ష్యంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో షుర్ ఆర్గనైజర్ సూపర్‌వైజర్ దోంగ్రే దివాకర్, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో రెగ్యులర్ అటెండర్లను నియమించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో రెగ్యులర్ అటెండర్లను నియమించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సీఈఓ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అనేక ఉన్నత పాఠశాలల్లో అటెండర్లు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్ని పాఠశాలల్లో వెంటనే అటెండర్‌లను నియమించాలన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ బాలుర పాఠశాలలో అటెండర్ లేక అవస్థలు పడుతున్నారని నియామకంపై దృష్టి సారించాలని కోరారు. పాఠశాలను సందర్శించినప్పుడు 400 మందికి పైగా విద్యార్థులున్న పాఠశాలలో అటెండర్లు బదిలీ వెళ్లిపోగా నూతన అటెండర్లు రాకపోవడంతో పాఠశాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గేడం టికనంద్, గొడిసెల కార్తీక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, టీఏజీఎస్ అధ్యక్షురాలు కొరేంగ మాలాశ్రీ, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు చాపిడి శ్రావణి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు చటరే భీంరావు పాల్గొన్నారు.

రేపటి బంద్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆదివాసీ మహిళకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో 21న నిర్వహించే రాష్ట్ర బంద్ విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు కోవ విజయ్ కుమార్ కోరారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జైనూర్ సంఘటనలో లైంగిక దాడికి గురైన ఆదివాసీ మహిళకు వెంటనే న్యాయం చేయాలన్నారు. ఆదివాసీ మహిళకు అండగా ఉండే విధంగా బందు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా బందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పేందూర్ మారుతి, డివిజన్ ప్రధాన కార్యదర్శి కోట్నాక రామ్‌షావ్, వాంకిడి మండల ప్రధాన కార్యదర్శి కనక ప్రకాష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు

- గంటపాటు కొనసాగిన రాస్తారోకో
- కలెక్టర్ హామీతో నిరసన విరమణ



రోడ్డుపై బైటాయించి రాస్తారోకో నిర్వహిస్తున్న ఆదర్శ పాఠశాల విద్యార్థులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదర్శ పాఠశాలల్లో గత శనివారం జరిగిన బదిలీల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని పాఠశాలలో పనిచేస్తున్న 17 మంది ఉపాధ్యాయులు బదిలీ కాగా కేవలం ఇద్దరు మాత్రమే రావడంతో చదువులు అటకెక్కిన వేళ తమకు ఉపాధ్యాయులు కావాలంటూ విద్యార్థులు రోడ్డెక్కారు. పాఠశాల నుండి పాదయాత్రగా జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయం వరకు చేరుకుని అక్కడ ప్రధాన రహదారిపై బైఠాయించి ఉపాధ్యాయులను కేటాయించాలంటూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి డీఈఓ ఉదయ బాబు, డీఎస్పీ కరుణాకర్, సీఐ సతీష్ అక్కడికి చేరుకొని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయిన విద్యార్థులు శాంతించలేదు. దాదాపు గంట పాటు రాస్తారోకో నిర్వహించిన తర్వాత నచ్చజెప్పి విద్యార్థులను పాఠశాలకు పంపించారు. విద్యార్థులకు ప్రతినిధులుగా కొంత మందిని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే వద్దకు తీసుకువచ్చి వినతిపత్రం అందజేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ పాఠశాల నుండి వెళ్లిన ఉపాధ్యాయులు రావడానికి సిద్ధమైతే వారిని తిరిగి నియమిస్తామని లేదంటే తాత్కాలిక ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు తిరిగి పాఠశాలకు చేరారు. ఏది ఏమైనా 850 మందికి పైగా విద్యార్థులున్న పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడం ఇతర ప్రాంతాల ఉపాధ్యాయులను ఆసిఫాబాద్‌లో కేటాయించే విధంగా చర్యలు తీసుకోకపోవడంపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యా సంవత్సరం మధ్యలో ఉపాధ్యాయులు వెళ్లడంతో విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. కలెక్టర్ హామీ నెరవెరకుంటే భవిష్యత్తులో మరోసారి ఆందోళన చేస్తామని విద్యార్థులు హెచ్చరించారు. విద్యార్థుల ధర్నాకు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి మద్దతు తెలిపారు.

మండలాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే
- జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశం





నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని అన్ని మండలాలను ఆదర్శంగా తీర్చిదిద్దేలా మండల ప్రత్యేక అధికారులు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి సీఈఓ లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశానికి అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబుతో కలిసి హాజరయ్యారు. అన్ని శాఖల ఉన్నత అధికారులు తమ ప్రగతి నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి సంబంధించిన రోజువారి అభివృద్ధి పనులకు సంబంధించి ప్రత్యేక ప్రొఫార్మా తయారు చేసినట్లు తెలిపారు. దీని ద్వారా ఎప్పటికప్పుడు ఫీడ్ బ్యాక్ అందించాలన్నారు. క్షేత్రస్థాయిలో మండలాలలో అందుబాటులో ఉంటూ అన్ని శాఖల సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి చేయాలన్నారు. ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేయాలని, స్టీల్ వాడకాన్ని పెంచాలన్నారు. గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన కంపోస్టు షెడ్ల ఎరువుల ద్వారా అదనపు ఆదాయం వచ్చేలా కృషి చేయాలన్నారు. మండలాల్లో బాగా పనిచేసే వారిని మెచ్చుకోవడంతో పాటు పని చేయని వారిని శిక్షించాలని సూచించారు. అంతకు ముందు అదనపు కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై అధికారులు దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. తాజాగా గ్రామపంచాయతీలో జీతాలు మంజూరయ్యాయని వాటిని చెల్లించారా లేదా అనేది పరిశీలించాలని సూచించారు. పాఠశాలలు సందర్శించేటప్పుడు సానిటేషన్, తిండికి సంబంధించిన మెనూ, పిల్లలు స్థితిగతులు పరిశీలించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటునే అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేయాలన్నారు. మహిళా శక్తి కింద 23 రకాల పనులు నిర్వహించడం జరుగుతుందని వాటిని సక్రమంగా నిర్వహించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

- జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎఫ్ఓ నీరజ్ కుమార్ టిబ్రేవాల్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉద్యోగ జీవితంలో బీజీగా ఉన్న ఉద్యోగులకు క్రీడలు శారీరక మానసికోల్లాసం కలిగిస్తాయని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల క్రీడా పాఠశాల మైదానంలో అటవీ శాఖ ఉద్యోగులకు నిర్వహించిన జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్‌కు కాగజ్‌నగర్ ఎఫ్‌డీఓ సుశాంత్ సుఖదేవ్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జెండా ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఉద్యోగులకు కొంత ఊరటను కలిగిస్తాయన్నారు. ఉద్యోగ జీవితం నుండి కొంత ఉపశమనం కలగడంతో పాటు మానసిక శారీరక ఆరోగ్యాన్ని కలిగిస్తాయన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అటవీ శాఖ క్రీడాకారులు జోనల్ స్థాయిలో పాల్గొంటారని వివరించారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 200 మంది వివిధ స్థాయిల అటవీ ఉద్యోగులు పాల్గొన్న జిల్లా స్పోర్ట్స్ మీట్‌లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్, క్యారమ్స్, చెస్‌తో పాటు అథ్లెటిక్స్ నిర్వహించారు. సాయంత్రం కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీలు గెలుపొందిన వారికి బహుతులు అందించారు. అనంతరం ఉద్యోగులతో కలిసి టాగ్ ఆఫ్ వార్‌లో పాల్గొన్నారు. క్రీడలను జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి పర్యవేక్షించగా, పీడీలు మధుసూదన్, తిరుపతి, రాకేష్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాలోని 11 రేంజ్ కార్యాలయాల ఎఫ్ఆర్‌ఓలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే రాత పూర్వకంగా ఇవ్వండి

నవతెలంగాణ-కౌటాల

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓటర్ లిస్టు విడుదల చేశామని, అభ్యంతరాలుంటే రాతపూర్వకంగా ఇవ్వాలని ఎంపీడీఓ కోట ప్రసాద్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల జాబితా పరిశీలించి అభ్యంతరాలుంటే రాత పూర్వకంగా తెలియజేయాలన్నారు. ఇప్పటికే ఓటరు జాబితను ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ సాదారణ ఎన్నికలు వార్డుల వారీగా తయారుచేసిన 35వ ఓటర్ల జాబితా డ్రాఫ్స్ లిస్టుపై రాజకీయ పార్టీల మండలాధ్యక్షులతో ఎంపీడీఓ అల్బర్ట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ, వార్డులలో మార్పులు, చేర్పుల గురించి చర్చించారు. ఎవరికైన ఓటరు లిస్టుపై అభ్యంతరాలుంటే సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల మండలాధ్యక్షులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.





గ్రామాల్లో ఆరోగ్య శిబిరం



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని మురళీగూడ, జిల్లెడ గ్రామాల్లో వైద్యాధికారి సతీష్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా 136 మందికి పరీక్షలు నిర్వహించగా 24 మంది రక్త నమూనాలు సేకరించి మిగతా వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ అనార్‌వి, ల్యాబ్ టెక్నీషియన్ నాగరాజు, హెల్త్ అసిస్టెంట్ ధర్మారావు, ఏఎస్ఎం లక్ష్మీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వాంకిడి : మండలంలోని కమాన గ్రామంలో గల గొల్లగూడ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించడం జరిగిందని ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తలపై, వ్యక్తిగతతో పాటు చేతులు శుభ్ర పరిచే విధానంపై అవగాహన కల్పించారు. గ్రామంలో పారిశుధ్యం ఉండేలా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్ సారికతో పాటు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మిలాద్ ఉన్ నబి వేడుకలు జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో జామా మసీద్ నుండి వివేకానంద చౌక్, అంబేద్కర్ చౌక్, గాంధీ చౌక్ మీదుగా శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జామా మసీద్, జనకాపూర్ మసీదులలో అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ మొహమ్మద్ ప్రవక్త చెప్పిన శాంతి మార్గంలో నడవాలని, మహమ్మద్ ప్రవక్త చూపిన బాటలో నడుస్తూ సేవ తత్వాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. మహమ్మద్ ప్రవక్త లోకానికి శాంతి సందేశం ఇచ్చారని ప్రతి ఒక్కరిని సోదర సమానులుగా భావించాలని కోరారు. పట్టణంలోని పలుచోట్ల ముస్లిం సోదరులు మంచినీళ్లు, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, మౌలానా అయాజ్ అష్రఫీ, నాయకులు బాసిత్, శంషాద్ హుస్సేన్, సాజిద్, అబ్దుల్ రహమాన్, నీసార్, పెంటూ, ఇమ్రాన్, అహ్మద్ బిన్ అబ్దుల్లా, ఉబెద్ బిన్ యాహియా, ఎండీ అహ్మద్, తాజ్, ఖలీల్, అమర్, జాఫర్ పాల్గొన్నారు.

పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలి



నవతెలంగాణ-దహెగాం

గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని సీడీపీఓ రేణుక అన్నారు. గురువారం మండలంలోని బిబ్రా గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బలమైన పోషకాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యవంతమైన పిల్లలు పుడతారని, పుట్టిన పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారన్నారు. స్త్రీలలో రక్తహీనత లేకుండా చేసేందుకే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో పాలు గుడ్లతో పాటు అనేక రకాల పోషకాహారాన్ని ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అనసూర్య, సరోజినీ, అంగన్‌వాడీ టీచర్ రూప ఈశ్వరి, ఆయాలు విజయ, రాజేశ్వరి, ఆశా కార్యకర్త సంగీత, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులున్నారు.

జిల్లా ఆస్పత్రిలో నాణ్యమైన సేవలందించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా ఆస్పత్రిగా అవతరించిన తర్వాత అనేక మౌలిక వసతులు పెరిగాయని వీటితో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. నిర్మాణం చివరి దశలో ఉన్న జిల్లా కేంద్రంలోని జిల్లా ఆస్పత్రిని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల జిల్లాలో అన్ని వసతులతో ఆస్పత్రి కావడం సంతోషంగా ఉందన్నారు. అయితే వైద్యులు కూడా నాణ్యమైన సేవలందించే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.చెన్నకేశవ రావు, డా.హర్షవర్ధన్, డా కృష్ణ, డా.నవీద్, మాజీ జడ్పీటీసీ అరిగేల నాగేశ్వర్ రావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్ రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, బీజేవైఎం సుచిత్, జిల్లా కోశాధికారి అరుణ్ లోయ, అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్ర చారి, సొల్లు లక్ష్మి, సిద్ధంశెట్టి సుహాసిని, సౌరబ్, కొండ తిరుపతి పాల్గొన్నారు.

నూతన గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని మర్రిగూడ గ్రామ పంచాయతీ పరిధి ఆమ్లెట్ గ్రామాలైన ఎస్సీ కాలనీ, నాయకపు గూడాలను కలిపి నూతన గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలని ఆ రెండు గూడాల గ్రామస్తులు కోరారు. గురువారం ఎంపీడీఓ శశికళను కలిసి వినతిపత్రం అందించారు. ఆ రెండు గూడాలలో దాదాపు 600 మందికి పైగా జనాభా ఉన్నారని, మర్రిగూడ గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. పరిపాలన అభివృద్ధి సౌలభ్యం కోసం నూతన గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు ప్రేమ్ సాగర్, గంగారాం, కాంతారావు, భీంరావు, ఇందూర్, పోచం శ్రీనివాస్, భీమన్న నరసయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఓటర్ జాబితాపై రాజకీయ పార్టీతో సమావేశం

నవతెలంగాణ-కాసిపేట



మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, ఎంపీఓ షేక్ సఫ్దర్ ఆలీ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2వ సాధారణ స్థానిక సంస్థ ఎన్నికలు 2024కు సంబంధించి డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా అభ్యంతరాలపైన వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి అభిప్రాయాలనను తీసుకున్నారు. ఈ మేరకు పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, నాయకులు అగ్గి సత్తయ్య, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మైదం రమేశ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోలేటి స్వామి, రాజ్ కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్, సీపీఐ నాయకులు జాడి పోశం, సీనియర్ అసిస్టెంట్ ఆకుల లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసిన అధికారులు



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని గురువారం డీటీఎఫ్ టీం ఆధ్వర్యంలో కూల్చివేశారు. టీబీజీకేఎస్ నాయకుడు డీకొండ అన్నయ్య సర్వే నంబర్ 40లో ఇంటి నిర్మాణానికి అనుమతులు తీసుకొని, అక్రమంగా ప్రభుత్వ భూమి అయిన సర్వే నెంబర్ 42లో నిర్మాణాలు చేపట్టారు. దీనిపై మున్సిపల్ అధికారులు ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చిన పట్టించుకోలేదని, అనుమతులు లేని కారణంగానే కూల్చేయడం జరిగిందని డీటీఎఫ్ టీం అధికారులు తెలిపారు. ఐదంతస్తుల మేడాను పేక మెడల్లా కూల్చేస్తుంటే మందలాదిమంది ప్రజలు అధికారులపై ప్రశంసల జల్లు కురిపించారు. హైదరాబాద్ హైడ్రా మంచిర్యాలకు తాకిందని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

మోడల్ ఉపాధ్యాయులకు ఘనంగా స్వాగతం



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు బండ శాంకరి అధ్యక్షతన స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు మూడు అంచెలలో బలమైన నిర్మాణంతో 80 వేలకు పైగా సభ్యులున్న ఏకైక సంఘం పీఆర్టీయూటీఎస్ అని అన్నారు. సభ్యులకు ఎటువంటి సమస్య తలెత్తిన కంటికి రెప్పలా కాచుకుని కాపాడే ఏకైక సంఘమన్నారు. భవిష్యత్తులో సంఘం ద్వారా ఎస్జీటీ ఉపాధ్యాయులకు పీఎస్ హెచ్ఎం పోస్టులు ఇప్పించడంతో పాటు స్కూల్ అసిస్టెంట్లకు కూడా ఉద్యోగోన్నతులు కల్పించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. మెరుగైన పీఆర్సీ సాధించడంతో పాటు పెండింగ్ డీఏలు ఇప్పించడానికి సంఘం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గంప శ్రీనివాస్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఖలీల్, జిల్లా నాయకులు అన్నం రమణారెడ్డి, తణుకు నాగేశ్వర్ రావు, మండల అసోసియేట్ అధ్యక్షులు పల్లె కృష్ణగోపాల్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-నస్పూర్

బీసీల సమస్యలు పరిష్కరించాలని బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బీసీ కార్పొరేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ వినోద్ కుమార్‌కు నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన బీసీ ఫెడరేషన్లకు పాలక మండళ్లు ఏర్పాటు చేసి, నిధులు విడుదల చేయాలన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం బీసీ కార్పొరేషన్ల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న 5లక్షల 42 వేల మందికి సబ్సిడీ రుణాలు వెంటనే మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలో రూ.లక్ష కోట్లతో బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన బీసీ కార్పొరేషన్లకు చట్టబద్ధత కల్పించి, ఒక్కొక్క కార్పొరేషన్‌కు రూ. 2000 కోట్ల నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలన్నారు. జనాభా ప్రాతిపాదికన బడ్జెట్ కేటాయించాలని, మంచిర్యాల జిల్లాలో బీసీ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించి నిధులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు సాకపురి భీమ్‌సేన్, మూగల మహేష్, బండ సతీష్ పాల్గొన్నారు.

రేపటిలోగా అభ్యంతరాలు తెలియజేయాలి

నవతెలంగాణ-తాండూర్



రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 13న ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితాపై ఈ నెల 21 వరకు అభ్యంతరాలు, ఆక్షేపణలు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తు అందజేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. గురువారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గ్రామ స్థాయిలో ముసాయిదా జాబితాలను స్థానిక గ్రామ పంచాయతీ, మండల అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో జాబితా ప్రకటించడం జరిగిందని తెలిపారు. ఆ జాబితాలపై అభ్యంతరాలు, ఆక్షేపణలుంటే ఈ నెల 21లోగా సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు అందజేయాలని పేర్కొన్నారు. అభ్యంతరాలను పరిశీలించి ఈ నెల 26 లోగా పరిష్కరించడం జరుగుతుందని, తుది ఫోటో ఎలెక్టోరల్ జాబితాను ఈ నెల 28న ఆయా గ్రామ పంచాయతీ, మండల అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో సీఐ కుమారస్వామి, ఎంపీఓ అనిల్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఈసా, జిల్లా ఉపాధ్యక్షులు సూరం రవీందర్, బీజేపీ నాయకులు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల పాత్ర ఎంతో కీలకం

- సీనియర్ సివిల్ జడ్జీ అర్పిత మారంరెడ్డి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించడంలో అంగన్‌వాడీల పాత్ర ఎంతో కీలకమని సీనియర్ సివిల్ జడ్జీ అర్పిత మారంరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ భవన్ ఆవరణలో అంగన్‌వాడీలకు ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో అనేక రకాల సమస్యలు వాటి ఇబ్బందుల నిర్మూలనకు చట్టాలపై అవగాహన ఎంతో అవసరమన్నారు. ప్రతి అంగన్‌వాడీ కార్యకర్తకు అన్ని కుటుంబాలతో ఉండే సత్సంబంధాల వలన ప్రజలకు చట్టాల గురించి నేరుగా అవగాహన కల్పించే అవకాశం లభిస్తుందన్నారు. ప్రతి ఆడబిడ్డ ఒక తల్లిగా, చెల్లిగా, కూతురుగా పోషిస్తున్న పాత్రలు అదేవిధంగా మగవారు కుటుంబాల కోసం చేస్తున్న త్యాగాలను అవగాహన చేసుకుంటే గొడవలే జరుగవని వివరించారు. ముఖ్యంగా సమాజంలో విడాకుల కేసులు ఎక్కువ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తమ పౌరులుగా రాణించాలంటే చట్టాలతో పాటు స్వీయ నియంత్రణతో కూడిన ప్రవర్తన ఎంతో అవసరమన్నారు. మహిళల కేసుల విషయాల్లో పలువురు అంగన్‌వాడీల అనుమానాలను న్యాయమూర్తి నివృత్తి చేశారు. అదే విధంగా సమాజంలో పాత్రికేయులు వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలకు మరింత ప్రభావితంగా చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త ఇంటింటికి చట్టాల గురించి సమాచారాన్ని చేరవేయాలని కోరారు. అంతకు ముందు మంచిర్యాల ఏజీపీ సత్య శ్రీలత, న్యాయవాదులు పద్మ అక్కల శ్రీధర్, లక్షెట్టిపేట ఏజీపీ సత్యం, రవీందర్ అంగన్‌వాడీలకు చెక్ బౌన్స్, గృహహింస, వరకట్నం, ఫోక్సో, గంజాయి, భూ హక్కులు, ఆస్తి హక్కులు, పలు ఒప్పందాలకు సంబంధించిన చట్టాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో న్యాయమూర్తిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు నేరెళ్ల పద్మ, అక్కల శ్రీధర్, ఎస్సై పనస రాజయ్య, జూనియర్ అసిస్టెంట్ నీరజ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఆదరణ చూడలేక విమర్శలు

- ప్రధాన మంత్రి మోడీ, అమిత్ షా దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-మంచిర్యాల

దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని విమర్శించే నైతిక హక్కు బీజేపీకి లేదని ఆ పార్టీ నాయకులు అన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ కేంద్ర మంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం సెంట్రల్ మినిస్టర్ అమిత్ షా దిష్టి బొమ్మలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేత తన్వీర్ సింగ్ మాటలను ఖండించారు. దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన కుటుంబం రాహుల్ గాంధీదని గుర్తు చేశారు. ఆ కుటుంబాన్ని విమర్శించే హక్కు బీజేపీ నాయకులకు లేదన్నారు. ప్రజల్లో కాంగ్రెస్‌పై ఏర్పడుతున్న సానుభూతిని తట్టుకోలేని బీజేపీ నాయకులూ రాహుల్ గాంధీపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. బడుగు బలిహీన వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పని చేస్తుంటే అగ్రవర్ణాల కోసం బీజేపీ పని చేస్తుందన్నారు. బయటకు వస్తే చంపేస్తామని రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తన్వీర్ సింగ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలనీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మెన్ కొట్నాక తిరుపతి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ చిట్ల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, కౌన్సిలర్లు చంద్రశేఖర్, వేముల సంజీవ్, మహిళ నాయకురాలు పెంట రంజిత పాల్గొన్నారు.

కరెంట్‌తో రైతులను చంపాలని చూసిన ఇద్దరి అరెస్ట్

నవతెలంగాణ-లక్షెట్టిపేట



కరెంట్ షాక్ పెట్టి రైతులను చంపాలని చూసిన ఇద్దరినీ అరెస్టు చేసినట్లు లక్షెట్టిపెట సీఐ అల్లం నరేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హాజీపూర్ మండలం పెదంపేట గ్రామానికి చెందిన నక్క ముజ్జన్న, తండ్రి రాజయ్య అనే వ్యక్తికి బలరావుపేట గ్రామశివారులో వ్యవసాయ భూమి ఉంది. ఆభూమికి ఆనుకొని మట్టిరోడ్డు ఉండగా రోడ్డును ఆక్రమించి వరిసాగు చేసుకుంటున్నాడు. భూమికి ఎదురుగా బెడద బసవయ్య భూమి కూడా ఉండటంతో ఈయన కూడా కొంత మట్టి రోడ్డును ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. ఇద్దరు రోడ్డు ఆక్రమించి సాగుచేసుకోవడంతో అవతలి పొలాలకు రైతులు వెళ్లడం ఇబ్బందిగా ఉండటంతో అందరూ కలిసి ఎంసీకి ఫిర్యాదు చేశారు. కొలతలు వేసి ఇద్దరి పొలంలో హద్దురాళ్లు వేసి మట్టి రోడ్డును ఫిక్స్ చేసారు. ఎంసీ చెప్పిన ప్రకారం బెడద బసవయ్య తన పొలంలో వేసిన హద్దు రాళ్ళ వరకు మట్టిరోడ్డుకు ఇవ్వడానికి అంగీకరించాడు. నక్క ముజ్జన్న మాత్రం ఇవ్వకుండా ఈ విషయం ఉత్తరం వైపు భూమి యజమాని అప్పటి జడ్పీటీసీ ముత్తె సత్తయ్యకు తెలియజేశాడు. అటుగా వెళితే రైతులు కరెంట్ షాక్‌తో మరణిస్తారని ముత్తె సత్తయ్య సలహా ఇస్తూ ప్రోత్సహించాడు. దీంతో జులై 31న రాత్రి ముజ్జన్న అట్టి మట్టిరోడ్డుకు అడ్డంగా కొయ్యలు పాతి విద్యుత్ వైర్లు, జీఏ వైరుతో మోటార్ నుండి కరెంటు కనెక్షన్ పెట్టాడు. విషయం తెలుసుకున్న పోలీసులు విద్యుత్ షాక్ పెట్టి రైతులను చంపాలని చూసిన నక్క ముజ్జన్న, ముత్తె సత్తయ్యలను అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించామని తెలిపారు. ఇందులో ఎస్సై సతీష్ పాల్గొన్నారు.

25న చలో హైదరాబాద్ పోస్టర్ల విడుదల

నవతెలంగాణ-మంచిర్యాల



చెరువులు, కుంటలను కబ్జాలు, కాలుష్యం నుండి కాపాడాలని ఈ నెల 25న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర సదస్సుకు సంబంధించిన పోస్టర్లను వాడబలిజ సంఘం జిల్లా అధ్యక్షులు బోడెంకి మహేష్ విడుదల చేశారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రాముని చెరువు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆవిష్కరించి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నంలో జరిగే రాష్ట్ర సదస్సుకు ముఖ్య అతిథులుగా ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నేటికీ మత్స్యవృత్తిపై ఆధారపడి సుమారు పది లక్షల మంది మత్స్య కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయని తెలిపారు. జిల్లాలో ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలలో 12వేల మంది మత్స్యకారులు సభ్యులుగా ఉన్నారన్నారు. 10 ఏండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ తెలంగాణ ప్రభుత్వంలో మత్స్యకారుల జీవితాలలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. రాష్ట్రంలో భూదందాలు, రియల్ ఎస్టేట్ పేరుతో పెద్ద మొత్తంలో చెరువులు, కాలువలు కబ్జాకు గురయ్యాయన్నారు. మరోవైపు పారిశ్రామిక అభివృద్ధి పేరుతో పట్టణాల నుండి వస్తున్నా రసాయనిక డ్రైనేజీ నీరు మొత్తం చెరువులు, కుంటలలో కలవడం వల్ల మత్స్య సంపద అంతరించి పోతుందన్నారు. ఈ నెల 25న రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో జరిగే రాష్ట్ర సదస్సుకు మత్స్యకారులు అధిక సంఖ్యలో పాల్గొని ఐక్యతను చాటాలని కోరారు. కార్యక్రమంలో వాడబలిజ సంఘం జిల్లా అధ్యక్షులు బోడెంకి మహేష్, గంగపుత్ర సంఘం జిల్లా నాయకులు గుమ్ముల శ్రీనివాస్, మత్స్యకారుల నాయకులు గగ్గురి రాజన్న, బట్టి కృష్ణ, పానేం సతీష్, బోడెంకి మాధవ్, పానేం సృజన్ పాల్గొన్నారు.

లాభాల వాటాను ప్రకటించాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సంస్థకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన వాస్తవ లాభాలను ప్రకటించి కార్మికులకు 35 శాతం వాటా ఇవ్వాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టెం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సింగరేణి యాజమాన్యం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 70.02 మిలియన్ టన్నులకు గాను పూర్తిగా 100శాతం ఉత్పత్తి ఉత్పాదకత సాధించిన ఈ ఆర్థిక సంవత్సరం ముగిసి దాదాపు 6 నెలలు గడిచిన లాభాలు ప్రకటించకపోవడం శోచనియమన్నారు. దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థలలో వాటికి వచ్చిన లాభాలు ప్రకటించినప్పటికీ సింగరేణి యాజమాన్యం మాత్రం సింగరేణి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆలస్యం చేస్తుందని, యాజమాన్యం వెంటనే వాస్తవ లాభాలను ప్రకటించి అందులో నుండి సింగరేణి ఉద్యోగులకు 35శాతం లాభాల వాటను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పొగాకు రమేష్, ఆర్గనైజ్ సెక్రెటరీ అన్వేష్ రెడ్డి, కేంద్ర కార్యవర్గ సభ్యులు ఎండీ లాల, సీనియర్ నాయకులు బత్తుల రాజేశం, గొర్ల సంతోష్, మైపాల్ రెడ్డి, గద్దం సుధాకర్, సాదుల భాస్కర్, ఉప్పుల సంపత్, దుర్గం రవి, గోపాల్, పాపిరెడ్డి, రాజు నాయక్, బిరుదు శ్రీనివాస్, పాదం శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, టి.నరేష్, సల్మాన్, తిరుపతి రెడ్డి, కార్తీక్, హరీష్, సదానందం, తిరుపతి పాల్గొన్నారు.

కలమడుగు వాసికి జాతీయ స్థాయి అవార్డు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన బొంతల మధుకర్‌కు జాతీయ స్థాయి అవార్డు వరించింది. మొక్కజొన్నలో డ్రోన్లను ఉపయోగించి కలుపు మందుల పిచికారిపై చేస్తున్న పరిశోధనను గుర్తించి ఢిల్లీలోని ఇండియన్ సొసైటి ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ అండ్ టెక్నాలజీ రీసర్చ్ ఆధ్వర్యంలో కరెంట్ ఇన్నోవేషన్ అండ్ టెక్నలాజికల్ అడ్వాన్స్ అగ్రికల్చర్ అండ్ అలైడ్ సైన్స్ విభాగంలో జాతీయ స్థాయి ఉత్తమ అవార్డును అందుకున్నారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన ఆయన డిగ్రీని పోలాస వ్యవసాయ కళాశాలలో, పీజీ విశ్వా భారతీ శాంతినికేతన్ వేస్ట్ బెంగాల్‌లో పూర్తి చేసి ప్రస్తుతం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేస్తున్నాడు. ఈ అవార్డు అందుకోవడం పట్ల ఆయనను గ్రామ ప్రజలు అభినందించారు.

21న రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-కాసిపేట

కుమురం భీం జిల్లా జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై లైంగిక అఘాయిత్యాన్ని ఖండిస్తూ బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 21న తుడుందెబ్బ రాష్ట్ర బంద్‌కు పిలుపు ఇచ్చిందని దాన్ని విజయవంతం చేయాలని నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల బాపు పేర్కొన్నారు. గురువారం మండలంలోని దేవాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కొమ్ముల బాపు మాట్లాడారు. ఈ రాష్ట్ర బంద్‌కు వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలు, కళాశాలలు, అందరూ సహకరించాలని కోరారు. బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ మండల అధ్యక్షులు సంద్ర భూమయ్య, రాయి సెంటర్ ఉపమేడి కుమ్రం జనార్దన్, ఆదివాసీ సేనా ఉపాధ్యక్షులు పెందూర్ ప్రభాకర్, ఆడె శ్రీను, సిడాం శంకర్, నాయకులు రాయిసిడాం రామ్‌దాస్, మెస్రం రంజిత్ పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు



నవతెలంగాణ-జన్నారం

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కమ్మల విజయ ధర్మ అన్నారు. గురువారం రుణమాఫీ మాట నిలబెట్టుకోవాలని రాష్ట్ర వ్యాప్తంగా రైతులు చలో ప్రజాభవన్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో కమల విజయ ధర్మను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. రాత్రి నుంచి రైతులను, రైతు సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టుచేసి పోలీసు స్టేషన్లలో నిర్బంధించడం తగదన్నారు. అధికారంలోకి వస్తే ఏకకాలంలో రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని హామీఇచ్చి మోసం చేసినందుకే రైతులు ఆందోళనకు దిగారన్నారు. ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా తమకు తామే సంఘటితమై మొదలుపెట్టిన ఈ రైతు ఉద్యమం ఇంతటితో ఆగదని, ప్రభుత్వం తలవంచక తప్పదని స్పష్టం చేశారు. కాగా మధ్యాహ్నం పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు ఆయనను పరామర్శించి మద్దతు ప్రకటించారు. అక్రమంగా అరెస్టు చేసిన రైతులను ఉద్యమకారులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సిటిమల భరత్ కుమార్, ఫజల్ ఖాన్, సులువ జనార్దన్, బాలసాని శ్రీనివాస్ గౌడ్, ఒల్లాల నర్సాగౌడ్ పాల్గొన్నారు.

దండేపల్లి : రైతుల రుణ మాఫీపై ప్రజా భవన్ ముట్టడికి వెళ్లకుండా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, నాయకులు కాసనగొట్టు లింగన్న, అక్కల రవీందర్, అల్లంల సంతోష్, గొల్ల రాజమల్లులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసేవరకు పోరాటాన్ని ఆపేది లేదన్నారు. అక్రమ అరెస్టులతో ప్రజల పక్షాన చేసే ఉద్యమాన్ని ఆపలేరన్నారు. ఇప్పటి వరకు కేవలం రూ.2 లక్షల లోపు రుణాలు మాత్రమే మాఫీ చేసిందని దీంతో రుణమాఫీ జరగని రైతులు ఆందోళనలతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

27 నుండి జిల్లా స్థాయి సైన్స్, డ్రామా పోటీలు

నవతెలంగాణ-మంచిర్యాల

సెప్టెంబర్ 27 నుండి జిల్లా కేంద్రంలోని సైన్స్ కేంద్రంలో జిల్లా స్థాయి సైన్స్, డ్రామా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్య శాఖ అధికారి ఎస్.యాదయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మేనేజ్ మెంట్, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్పెషల్ ఆఫీసర్‌లకు సూచనలు అందించామన్నారు. ప్రపంచ నీటి సంక్షోభం, విపత్తులు అరికట్టడం, ఆరోగ్యం, పరిశుభ్రత, వాతవరణ మార్పు పలు అంశాలపై పోటీలుంటాయన్నారు. పాల్గొనే విద్యార్థులు నియమనిబంధనలు పాటించాలని సూచించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 25లోపు జిల్లా సైన్స్ అధికారి ఎస్. మధుబాబు 9849550200కు వివరాలు పంపించాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నవతెలంగాణ-తాండూర్



రవాణ వ్యవస్థకు ఆటంకం కలగకుండా ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తాండూరు సీఐ కుమారస్వామి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఐబీ అండర్ బ్రిడ్జీ వద్ద మాదారం ఎస్సై సౌజన్యతో కలిసి వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు అండర్ బ్రిడ్జీ కింద వాహనాలను నిలిపి ఉంచడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయని, బ్రిడ్జి కింద వాహనాలను నిలిపొద్దన్నారు. ప్రయాణికులకు రవాణకు అడ్డంకులు కలిగే విధంగా ద్విచక్ర వాహనాల పార్క్ చేస్తే ఫైన్ వేస్తామన్నారు. ఫోర్ వీలర్ వాహనాలను ఇంటి వద్ద కాకుండా బ్రిడ్జీ కింద ప్రతిరోజు పార్కింగ్ చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని పద్ధతి మార్చుకోకుంటే ఫోర్ వీలర్ సీజ్ చేస్తామన్నారు.

సెమీ స్కిల్ వేతనాలు వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-రెబ్బెన



నైపుణ్యమైన పనులు చేస్తున్న బ్లాస్టింగ్ కార్మికులకు అన్‌స్కిల్ వేతనాలు చెల్లించటం వ్యతిరేకమని వెంటనే సెమీ స్కిల్ చెల్లించాలని కాంట్రాక్ట్ కార్మికుల సంఘం నాయకులు ఏ.ఓదేలు డిమాండ్ చేశారు. గురువారం బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీ వద్ద బ్లాస్టింగ్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లాస్టింగ్ కార్మికులు చాలీచాలని వేతనంతో కుటుంబ పోషణ భారం అవుతుందన్నారు. సింగరేణిలో మిగతా ప్రాంతాలలో ఎక్స్‌ప్లోసివ్ పనులు చేస్తున్న కార్మికులకు సెమీ స్కిల్డ్ వేతనాలు చెల్లిస్తుండగా బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ జీఆర్ఎస్ కంపెనీ యాజమాన్యం శ్రీనివాస్ నాయుడు బ్లాస్టింగ్ కార్మికులకు వేతనాలు నెలకు రూ.5522 మాత్రమే చెల్లించడం అన్యాయమన్నారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ మనగడకు అవసరమైన నిధులు మంజూరు చేయడంతో పాటు గతంలో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. డిమాండ్స్ డేలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ గేటు ఎదుట ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్‌తో కలిసి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీకి ప్రభుత్వం నిధులు కేటాయించాలని, ఎన్నికల హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందన్నారు. 2013కు సంబంధించిన బాండ్ల డబ్బులను వెంటనే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్సీలు, డీఏలను వెంటనే ఇవ్వాలని అన్నారు. వెల్ఫేర్ బోర్డులను రద్దుచేసి ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని, ఆర్టీసీలో ఎన్నికలను నిర్వహించాలని, కొత్త బస్సులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. డీజిల్‌పై పెరుగుతున్న భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలన్నారు. డ్రైవర్ కండక్టర్లపై కేఎంపీఎల్, ఈపీకే వేధింపులు మానాలన్నారు. మహిళా కండక్టర్లకు రాత్రి 8 గంటలలోపు డ్యూటీ అయిపోయే విధంగా డ్యూటీ ఇవ్వాలని, మహిళా ఉద్యోగులకు రెండు సంవత్సరాల చైల్డ్ కేర్ ఇవ్వాలన్నారు. అక్రమంగా సస్పెండ్ చేసిన, విధుల నుండి తొలగించిన వారిని తిరిగి తీసుకోవాలన్నారు. 2019 సంవత్సరం సమ్మె కాలంలో ఉద్యోగులపై నమోదైన పోలీస్ కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. హైర్ బస్ డ్రైవర్లకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు అశోక్, ఇజాజ్, అలీ, శ్రీధర్, శ్రీనివాస్, లక్ష్మణ్, సురేష్, రాంకుమార్, ఆనంద్ రావు, పాశం పాల్గొన్నారు.

30న చలో సచివాలయం ముట్టడి

- దళిత ద్రోహిగా మిగిలిన రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సెప్టెంబర్ 30న తలపెట్టిన ఛలో సచివాలయం ముట్టడికి తరలి రావాలన ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మెన్, దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు గవ్వల శ్రీకాంత్‌తో కలిసి పాల్గొన్నారు. ముందుగా ఛలో ముట్టడి కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ కోసం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తమ్ కుమార్‌రెడ్డి నాయకత్వంలో మంత్రుల కమిటీని ఏర్పాటు చేసి దళిత సమాజంలో చిచ్చు పెట్టారని విమర్శించారు. దళిత జాతుల ఓట్లతో గద్దె నెక్కిన రేవంత్‌రెడ్డి దళితుల గిరిజన బహుజనులను విచ్ఛిన్నం చేసి భవిష్యత్ దెబ్బతిసారని అన్నారు. రాజ్యాధికారంను సాధించకుండా చేయడానికి వర్గీకరణ పేరుతో దళితుల అభివృద్ధిని అడ్డుకున్నారని అన్నారు. వర్గీకరణ పైన సుప్రీం కోర్ట్ ఇచ్చిన రాజ్యాంగం వ్యతిరేక తీర్పును ఉపసంహరించికోవాలని కోరుతూ వందకు పైగా దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌లు పెండింగ్‌లో ఉండగా, తొందరపడి వర్గీకరణ కమిటీని సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసి దళితుల ద్రోహిగా మిగిలాడని మండిపడ్డారు. ఈ సమావేశంలో సమితి జిల్లా అధ్యక్షులు సూర్యవంశీ విద్యాసాగర్, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థి యువజన సంఘం జిల్లా అధ్యక్షులు సెద్మకి భీమ్‌రావు, జిల్లా కార్యదర్శి మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షులు భీంరావు, నేతకాని సంఘం జిల్లా అధ్యక్షులు జునుగూరు లక్ష్మణ్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి బి.జగన్ సింగ్, జాదవ్ శ్యాం సుందర్, ఆజాద్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ షకీల్ పాల్గొన్నారు.

హెచ్‌బీటీలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ, టీజీటీ పోస్టుల కోసం గంటల ప్రాతిపదికన బోధించడానికి ఆసక్తి అర్హత గల వారి నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దుర్గం మహేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీటీ విభాగంలో తెలుగు, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, పౌరశాస్త్రం, అర్థశాస్త్రం, వాణిజ్యశాస్త్రం ఖాళీ ఉండగా టీజీటీ విభాగంలో తెలుగు, ఆంగ్లం, గణితం, సామాన్య శాస్త్రం ఖాళీగా ఉన్నాయని, పీజీటీలు 9వ తరగతి నుండి 12వ తరగతి వరకు బోధించాల్సి ఉంటుందని, టీజీటీలు 6 నుండి 8వ తరగతి వరకు బోధించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులలో పీజీ, బీఈడీ పూర్తి చేసి టెట్ అర్హత కలిగిన వారు ఈనెల 21వలోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-నార్నూర్

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఝరి పీహెచ్‌సీ డాక్టర్ సంజీవ్ కుమార్ అన్నారు. గురువారం స్వచ్ఛతహి సేవా కార్యక్రమంలో భాగంగా గాదిగూడ మండలం ఝరి పీహెచ్‌సీ పరిసరాలను శుభ్రం చేశారు. పరిసరాల్లోని చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ రవీందర్, వైద్య సిబ్బంది సిమ్మి కుమారీ, విజయ లక్ష్మి, సంగీత, సిడం సంగీత, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



రుణ లక్ష్యాలను బ్యాంకర్లు సాధించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



బ్యాంకర్ల మీటింగ్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

బ్యాంకర్లకు నిర్దేశించిన ప్రకారం రుణ లక్ష్యాలను సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసిక సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి దత్తారాం, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, నాబార్డు అధికారి వీరభద్రుడుతో కలిసి బ్యాంకర్లు, సెర్ప్, మెప్మా అధికారులతో రుణ లక్ష్యాల సాధనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన రుణ లక్ష్యాలను సాధించి అర్హులైన ప్రతి ఒక్కరికి రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని, స్వయం సహాయక సంఘాల ఖాతాలకు బ్యాంకు లింకేజీలు పూర్తి చేయాలని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో ప్రధానమంత్రి జన్ ధన్ యోజన పథకంలో 2 లక్షల 19 వేల 748 ఖాతాలు ఉన్నాయని, 1 లక్ష 3 వేల 968 ఖాతాలకు రూపే కార్డులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో మొత్తం 6,771 స్వయం సహాయక సంఘాలకు రూ.2,275 కోట్ల రుణ లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.777 కోట్ల ప్రగతి జరిగిందని, సంబంధిత అధికారులు బ్యాంకు అధికారులతో సమన్వయం చేసుకొని మిగతా లక్ష్యాన్ని సాధించాలన్నారు. ప్రధానమంత్రి ముద్ర రుణాలు రూ.15 కోట్ల అందించామని, బ్యాంకర్లు, ఎస్సీ కార్పొరేషన్, గిరిజన యువతకు రుణాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. నాబార్డు నుండి వ్యవసాయ అనుబంధ పాడి పరిశ్రమ, చేపల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఔత్సాహిక రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. ఇప్పటివరకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు రూ.1,983 కోట్ల అందించామన్నారు. లక్ష్యాలను పూర్తి చేసే విధంగా కృషి చేయాలని తెలిపారు. 2024 రైతు రుణమాఫీ పథకం మొదటి, రెండవ, మూడవ విడతలలో మొత్తం రూ.399 కోట్లు రైతుల ఖాతాలలో జమ చేశామన్నారు. ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాల ద్వారా ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు ఆర్థిక అభివృద్ధిపై అవగాహన కల్పించాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత రుణ లక్ష్యాలను సాధించే విధంగా పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలి

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు

నవతెలంగాణ-కెరమెరి

ఆదివాసులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని పోలీస్ శాఖ తరపున ఎలాంటి సాయం అందిచడానికైన తాము సిద్ధమని ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు పునరుద్ఘాటించారు. మండలంలోని పోలీస్ స్టేషన్‌లో కెరమెరి, వాంకిడి మండలానికి చెందిన ఆదివాసీ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధితో అన్ని రకాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆదివాసులు ఆదిశగా ముందుకు సాగాలన్నారు. అటువంటి అభివృద్ధి కోసం పోలీస్ శాఖ తరపున ఎటువంటి సాయం చేయడానికైనా నిరంతరం సిద్ధంగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఉన్నత చదువులను అభ్యసిస్తూ ఉన్నత ఉద్యోగాలను సంపాదించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందజేసే ప్రతి ఒక్క ప్రయోజనాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. జిల్లా పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణతో పాటు జిల్లాలోని ప్రజల, ఆదివాసుల అభివృద్ధికి అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. సమాజంలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నప్పుడే వారి అభివృద్ధి సాధ్యపడుతుందని, ఎవరికైనా సమస్యలుంటే వాటిని శాంతియుత మార్గం ద్వారా ప్రభుత్వానికి నివేదించాలని, అంతేగాని చట్టాన్ని చేతిలోకి తీసుకొని చట్ట వ్యతిరేక కార్యకలాపాల ద్వారా సమాజంలో అసాంఘిక కార్యకలాపాలు సృష్టించినట్టయితే ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఎవరిపైన కేసు నమోదు అయితే భవిష్యత్తులో ఎలాంటి ఉద్యోగాన్ని పొందడానికైనా అనర్హులవుతారని వారి భవిష్యత్తు అంధకారం అవుతుందని గుర్తు చేశారు. పోలీస్ తరపున మీసేవ సెంటర్ గాని ఇతర అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలలో స్థానిక ప్రజలకు అవకాశం కలిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో సీఐలు సత్యనారాయణ, రాణా ప్రతాప్, ఎస్సైలు విజయ్, ప్రశాంత్, రామారావు, మాజీ జడ్పీటీసీ ద్రుపదబాయి, మాజీ ఎంపీపీ పెందూరు మోతీరామ్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవా విజయ్, ఆదివాసి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మడావి భరత్ భూషణ్, మహిళా సంఘ నాయకురాలు కోవా ఇందిర, వివిధ సంఘాల నాయకులు కనక ప్రభాకర్, పెందూరు రాజేశ్వర్, మడాయి తుకారం, సోము, జగన్నాథరావు, రఘునాథ్, ఆదివాసీ సంఘాలతో నాయకులు, పోలీసు సిబ్బంది ల్గొన్నారు.

జీఓ 317 సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జీఓ నెంబర్ 317కు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి డిమాండ్ చేశారు. జిల్లాలో కొనసాగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 317 సమస్యల పరిష్కారం కోసం వెంటనే చర్యలు ప్రారంభించాలని కోరారు. ఈ జీఓతో ఉద్యోగులు ఉపాధ్యాయులు ఎంతగానో ఇబ్బంది పడుతున్నారన్నారు. కమిటీలతో కాలయాపన చేయకుండా సమస్య పరిష్కరించాలని కోరారు. ఉద్యోగులకు వెంటనే పీఆర్సీ అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, రాష్ట్రవ్యాప్తంగా 5571 ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలన్నారు. బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయడంతో పాటు వారి స్థానంలో అకాడమిక్ ఇన్స్ట్రక్టర్లను నియమించాలని కోరారు. కేజీబీవీతో పాటు అన్ని రకాల గురుకులల్లో పనిచేస్తున్న సీఆర్టీలు, గెస్ట్ ఉపాధ్యాయులకు 12 నెలల వేతనం అమలు చేయాలన్నారు. కొత్త పెన్షన్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటమే తమ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు హేమంత్ షిండే, వాంకిడి మండల ప్రధాన కార్యదర్శి హరీష్, మండల బాధ్యులు అనిత, హారిక, జ్యోతి, యశోద పాల్గొన్నారు.



వాంకిడి : మండలంలో గురువారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) నాయకత్వంలో మండలంలోని వివిధ పాఠశాలలను టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతకుమారి సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఉన్న అన్ని రకాల పనులను వర్తింప చేయాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బండె హరీష్, కేజీబీవీ ఎస్ఓ మీనా కుమారి, మండల బాధ్యులు లక్ష్మీ పాల్గొన్నారు.

లాభాల వాటను చెల్లించాలి : టీబీజీకేఎస్

నవతెలంగాణ-రెబ్బెన



సింగరేణి సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన లాభాలను వెంటనే వెల్లడించి కార్మికుల వాట చెల్లించాలని టీబీజీకేస్ ఉపాధ్యక్షుడు మాల్రాజ్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం గోలేటిలోని జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జీఎం ఎం.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు మాల్రాజ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సింగరేణి సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్ధారిత 70 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయడానికి ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, అధికారులు, కార్మిక సంఘాలు అంకుంటింత దీక్షతో కృషి చేశాయన్నారు. సింగరేణి సంస్థ అత్యధిక లాభాలు సాధించడం ఖాయమని ఉన్నత అధికారులు పదేపదే చెబుతూ వచ్చారన్నారు. కానీ ఆరు నెలలు గడిచిన ఇప్పటివరకు వాస్తవ లాభాలను వెల్లడించడంలో జరుగుతున్న జాప్యం వలన కార్మికుల్లో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయని ఆరోపించారు. ఈనెల ఆఖరిలోపు సాధించిన లాభాల నుంచి నుండి కార్మికుల వాటగా 35 శాతం చెల్లించే విధంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మారిన వెంకటేశ్వర్లు, అలవేణి సంపత్, డి.మంగీలాల్, మంత్ సమ్మయ్య, ఓరం కిరణ్, వంగ మహేందర్, ఎం శ్రీనివాస్, గణపతి, మైదానం వీరస్వామి, రామగిరి శ్రీనివాస్, బొంగు వెంకటేష్, ఎస్ రమేష్, హెచ్ సత్యనారాయణ, ఎం చంద్రయ్య వైకుంఠం చిరంజీవి, విద్యాసాగర్, అంజయ్య పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

- చిన్నారికి అన్నప్రాసన చేసిన కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని చించోలి గ్రామంలో ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోషణ మాసంలో కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ముఖ్యఅతిధిగా పాల్గొని, చిన్నారికి అన్న ప్రాసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలు బాగుంటేనే దేశం బాగుంటుందని, పోషకాహారంతోనే ఆరోగ్య సమాజం నిర్మితమవుతుందని అన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవాలని కోరారు. అలాగే తినేముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, పరిశుభ్రత పాటించాలని అన్నారు. చిన్నారులకు మొదటి బడి అంగన్‌వాడీ కేంద్రాలే కనుక వారికి క్రమశిక్షణ, పరిశుభ్రత, మంచి నడవడిక నేర్పించాలని అన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారంతో పాటుతగిన వైద్య పరీక్షలు చేసుకోవాలని, అవసరమైన చికిత్సలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఓపీ, స్టోర్ రూం, పేషెంట్ వార్డు, ఆన్‌లైన్‌లో స్టాక్, ఆస్పత్రిలో వైద్యుల, సిబ్బంది హాజరు, డెలివరీ రిజిష్టర్, డైట్, డిచ్చార్జ్ పరిశీలించారు. ఓపీ ఎలా ఉందని, ఆస్పత్రి ద్వారా సేవలు ఎలా అందిస్తున్నారని, ఈనెల ఎన్ని ప్రసవాలు జరిగాయని, ఫీవర్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కలీమ్, ఏఎస్‌డీపీఓ మిల్కా, సీడీపీఓ, ఎంపీడీఓ, ఎంపీఓ, సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలు సేవలు అందించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

స్వచ్ఛంద సేవ సంస్థలు ముందుకు వచ్చి మారుమూల ప్రాంతాలకు మరిన్ని సేవలు అందించాలని ఆసిఫాబాద్ పీఏసీఎస్ చైర్మన్ అలీబిన్ అహ్మద్, మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. గురువారం తిర్యాణి మండలంలోని ఉల్లిపిట్ట గ్రామంలో రామ్‌లీలా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విమలానంద, దుర్గం దుర్గం దేవు- నీలాబాయి 20 వర్ధంతి పురస్కరించుకొని నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశ్రాంత తహసీల్దార్ మంచికట్ల మల్లయ్య, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కరుణ గౌడ్, రిటైర్డ్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ప్రసాద్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబ్బులు సంపాదించి దాచుకోకుండా మారుమూల ప్రాంతాలకు సేవలందించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా సభ్యులను అభినందించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో మండలంలోని దాదాపు 300 మంది రోగులకు ఉచిత సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తిర్యాణి మండల పరిషత్ మాజీ అధ్యక్షులు ఆత్రం లక్ష్మణ్, రిటైర్డ్ ఎస్సై దుర్గం తుకారం, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డీఎస్ఆర్ ప్రసాద్, స్త్రీల వైద్య నిపుణురాలు సాధన దుర్గే, పిల్లల వైద్య నిపుణురాలు, వైద్య సిబ్బంది నిర్మల, సంతోషి, ఆశా వర్కర్లు భాగ్యలక్ష్మి సోము బాయ్, ఈశ్వరి, తానుబాయి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి ఎస్పీఎం ఉద్యోగి ఆత్మహత్య

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణం లారీ చౌరస్తాకు చెందిన ఎస్పీఎం ఉద్యోగి గుండు తిరుపతి (55) బుధవారం రాత్రి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ దీకొండ రమేష్ తెలిపారు. గతంలో పక్షవాతంలో బాధపడ్డ తిరుపతి, ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాడాగు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆయన వివరించారు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని కుమారుడు సాయికిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎంపీడీఓకు సన్మానం



నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలో గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ నవనీత్ కుమార్‌కు మండల బీజేపీ అధ్యక్షుడు ఏశాల దత్తాత్రి, నాయకులు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గత కొన్ని సంవత్సరాలుగా సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించి, మండల ప్రజలకు అన్ని రకాల సూచనలు సలహాలు అందించి, వారికి ఇబ్బందులు రాకుండా చూసిన సూపరింటెండెంట్‌కు ఇటీవల ఎంపీడీఓగా ప్రమోషన్ రావడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంగాశేఖర్, లింబాద్రి, కమలేష్, అజయ్, సీనియర్ నాయకుడు లింగం, మండల బీజేపీ కార్యకర్తలు ఉన్నారు.

పీఆర్టీయూ మండలాధ్యక్షుడిగా మహేందర్ యాదవ్



నవతెలంగాణ-తలమడుగు

పీఆర్టీయూ మండలాధ్యక్షుడిగా మహేందర్ యాదవ్‌ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవనంలో జరిగిన ఎన్నికల్లో మహేందర్ యాదవ్ మండలాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల శాఖ ఎన్నికల్లో ప్రధానకార్యదర్శిగా తక్సాండే సంతోష్, అసోసియేట్ అధ్యక్షులుగా తూము రవీందర్, కార్యదర్శిగా శ్రీరామ్ రెడ్డి, మహిళా ఉపాధ్యక్షులుగా విజయలక్ష్మి, మహిళా కార్యదర్శిగా అరుణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వరిలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు



నవతెలంగాణ-ముధోల్

మండలంలోని ఆయా గ్రామాల్లో గల వరి పంటను గురువారం ముధోల్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు క్షేత్ర స్థాయిలో వరి పంటలను పరిశీలించారు. ప్రధాన శాస్త్రవేత్త డా.నర్సయ్య ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు ఈ పంటలను పరిశీలించారు. అయితే వరి పంటలలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు సోకినట్లు గుర్తించారు. ఆకుల పైన పసుపు రంగు మచ్చలు, ఏర్పడి వీటి చుట్టూ డాగు, మచ్చగా ఏర్పడి క్రమేపి అంచుల వెంబడి అలల మాదిరిగా పై నుండి క్రమేపి మట్టల వరకు వ్యాప్తిస్తాయని తెలిపారు. వీటి నివారణకు కాపర్ హైడ్రాక్సైడ్ 400 గ్రాములు, అలాగే స్ట్రె ప్టొమైసిన్ సల్ఫేట్ 60 గ్రాములు, కలిపి ఎకరానికి చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. ఆయన వెంట శాస్త్రవేత్తలు డా.విజయ్ కుమార్, డా. కార్తీక్ ఉన్నారు.

ఓటరు లిస్టులో తప్పులుంటే సవరించుకోవాలి



నవతెలంగాణ-నార్నూర్

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వార్డుల వారీగా ఓటరు లిస్టు ముసాయిదా జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా తప్పులు ఉంటే వాటికి సవరణ చేసుకోవాలని, ఎంపీడీఓ జవహర్ లాల్, తహసీల్దార్ రాజలింగం సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ వివిధ పార్టీ ముఖ్య నాయకులతో సీఐ రహీమ్ పాషా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వార్డుల వారీగా ఓటరు లిస్టులో ఏవైనా తప్పులు ఉంటే గ్రామ కార్యదర్శులకు కలిసి ఓటర్లు సవరణ చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీఓ స్వప్నశీలా గ్రామాల నాయకులు గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-ముధోల్

నిర్మల్ జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ముధోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికల)లో బేటి బచావో బేటి పడావో కార్యక్రమం గురించి వివరించారు. ఈ సందర్భంగా జ్యోతి, మౌనిక మాట్లాడారు. విద్యార్థినులు మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సమాజంలో జరుగుతున్న లింగ వివక్షతను, బాల్యవివాహాలు, సైబర్ క్రైమ్, చైల్డ్ లైన్ సర్వీసెస్, బాలికల విద్యపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గీతా, ఉపాధ్యాయులు స్వర్ణలత, అంజూమ పర్వీన్, నీరజ, కవిత యాదవ్, కొక్కుల గంగాధర్, విద్యార్థినులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన మాజీ మంత్రి



నవతెలంగాణ-నిర్మల్

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తమ అనుచరులతో హైదరాబాద్ గాంధీ భవన్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. భారీ గజమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముధోల్, ఖానాపూర్, మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖాశ్యామ్ నాయక్, రాథోడ్ బాపురావు, నాయకులు లోక భూమారెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్తలు అల్లోల మురళీధర్‌రెడ్డి, అల్లోల సురేందర్‌రెడ్డి, ధర్మాజీ రాజేందర్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు పాకాల రామచందర్, ముడుసు సత్యనారాయణ, భూమన్న యాదవ్, మేడారం ప్రదీప్, శ్రీకాంత్ యాదవ్, ఆమెడ శ్రీధర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న టీయూటీఎఫ్ సభ్యత్వ నమోదు



నవతెలంగాణ-తలమడుగు

మండలంలో టీయూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతుంది. గురువారం టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించి, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. పేద విద్యార్థులకు మేలు చేసేలా ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలనీ పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెంటనే డీఏస్సీ నియామకాలు దసరాలోపు పూర్తి చేయాలని అన్నారు. అదేవిధంగా పెండింగ్ డీఏలను వెంటనే ఇవ్వాలని, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను చెల్లించాలని అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంగినేని రామారావు, తలమడుగు మండల అధ్యక్షులు ముస్కు సంజీవరెడ్డి, టీయూటీఎఫ్ సీనియర్ నాయకులు నాగన్న, ప్రఫుల్, చందర్‌రెడ్డి వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లోలెవల్ వంతెనకు మరమ్మతులు



నవతెలంగాణ-ముధోల్

ముధోల్ మండలంలోని బోరిగామ్ లోలెవెల్ వంతెనపై గుంతలు పడటంతో యూత్ సభ్యులు మరమ్మతులు చేసి శభాష్ అనిపించుకున్నారు. వివరాల్లోకెళ్తే... బోరిగామ్ నుండి కారేగాం ఎక్స్ రోడ్ మధ్యలో ఉన్నటువంటి లోలెవల్ వంతెన పైన వరద నీరు ఇటీవల ప్రవహించడంతో గుంతలు పడి వాహనదారులకు ఇబ్బందిగా మరి ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఈ విషయాన్ని తెలుసుకున్న బోరిగామ్ గ్రామానికి చెందిన రామ్ సేన యూత్ సభ్యులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గురువారం యూత్ తరుపున సిమెంట్, కాంక్రీట్‌తో గుంతలు పూడ్చారు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పాయి. యూత్ సభ్యులను వాహనదారులు, బోరిగామ్ మాజీ సర్పంచ్ అమృత మురళి, గ్రామస్తులు అభినందించారు. సంబంధిత అధికారులు చేయని పనిని యూత్ సభ్యులు చేసి శభాష్ అనిపించుకున్నారు.

మట్టి విగ్రహం ప్రతిష్టించి..13వ రోజు నిమజ్జనం చేసి

నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని బుద్ధివాన్ గణేష్ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏకదంత గణేష్ మట్టి విగ్రహం ప్రతిష్టించిన నిమజ్జన శోభాయాత్ర నేత్రపర్వంగా సాగింది. 12 రోజుల పాటు పూజలందుకున్న ఏకా దంతుడిని 13వ రోజున రంగురంగుల పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించి, భజన భక్తి పాటలకు నృత్యాలు చేస్తూ, స్థానిక వాగులో నిమజ్జనం చేశారు. నిమజ్జన శోభాయాత్ర గురువారం ఉదయం వరకు సాగింది. కాగా బుద్ధివాన్ గణేష్ మండలి వారు ప్రతిష్టించిన పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని భారీ విగ్రహాల జోలికి పోకుండా మట్టితో చేసిన మూడున్నర ఫీట్ల గణేశుడికి ప్రతిష్టించడం విశేషం. మండల కేంద్రంలో ఎన్నడూ లేని విధంగా పదమూడు రోజులకు నిమజ్జనం చేయడం విశేషం. అన్న ప్రసాదం గ్రామస్తులు అందరూ వచ్చి స్వీకరించారు. వచ్చే ఏడాది అందరూ కూడా పర్యావరణానికి హాని కలుగకుండా చిట్టి గణపతులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రవితేజ, సాయికిరణ్, మల్లికార్జున్, ఉదయ్ కిరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని ఘన్‌పూర్ అంగన్‌వాడీ టీచర్ అనారోగ్యంతో మంగళవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సీడీపీఓ ఉమాదేవి బాధిత కుటుంబ సభ్యులకు అంత్యక్రియలకు రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కుమ్ర పార్వతి, కుమ్ర యశ్వంతరావు, కుమ్ర కట్టి, కుమ్ర విష్ణు, గ్రామ పెద్దలు ఉన్నారు.

గీతాశక్తి పుస్తక రచయితకు సన్మానం



నవతెలంగాణ-భైంసా

మండలంలోని ఇలేగాం గ్రామానికి చెందిన రెడ్డ బాలాజీ గీతాశక్తి పుస్తకాన్ని రచించిన సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ గీతాశక్తి పుస్తకం రచించడం అభినందనీయమన్నారు. నేటి తరానికి భగవద్గీతలోని అంశాలు పరిచయం చేయడం మంచి పరిణామం అన్నారు. ప్రజలకు ఉపయోగపడే రచనలు మరింత చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, నాయకులు నర్సాగౌడ్, సోలంకి భీంరావ్, సాయిలు పాల్గొన్నారు.

ధర్మ మార్గాన్ని పాటించాలి



నవతెలంగాణ-నిర్మల్

ధర్మ మార్గాన్ని పాటించాలని నిర్మల్ డీఎస్పీ అల్లూరి గంగారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినిగర్‌లోని మసీద్ ఏ ఇక్బాల్‌లో మిలాద్ ఉన్ నబీ వేడుకలను జరుపుకొని, కమిటీ ఆధ్వర్యంలో శోభాయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ డీఎస్పీ మాట్లాడారు. ఇస్లాం మత స్థాపకులు మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని మిలాద్ ఉన్ నబీ పండుగను నిర్వహించుకుంటారని అన్నారు. అనంతరం మత గురువులు ఆధ్యాత్మిక బోధనలు చేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, కార్యక్రమ నిర్వాహకులు మహమ్మద్ ఇసాక్ అలీ, మనజీర్ సహాబ్, మౌలానా సయ్యద్ అన్వర్ ఖాద్రీ, సయ్యద్ మసూద్, సయ్యద్ అమీన్ బాబా, మహమ్మద్ లియాఖత్ అలీ పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాల్లో పోలీసుల పాత్ర అభినందనీయం

నవతెలంగాణ-నిర్మల్

గణేష్ ఉత్సవాల్లో పోలీసుల పాత్ర అభినందనీయమని జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల గురువారం ప్రకటనలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నిర్మల్, ముధోల్, బైంసా, ఖానాపూర్ పరిధిలో గణేష్ ఉత్సవాలు నిమజ్జన కార్యక్రమాన్ని నిర్విరామంగా రాత్రి, పగలనక పోలీసు అధికార, సిబ్బంది ప్రశాంత వాతావరణంలో జరిగేలా కృషి చేశారని కొనియాడారు. అలాగే ఇతర శాఖలు సైతం సమన్వయంగా పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. గణేష్ ఉత్సవ సమితీలు, ప్రజలు సహకరించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గణేష్ ఉత్సవాలు నిమజ్జన కార్యక్రమాలు జరుపుకోవడం జిల్లాకు గర్వనీయమన్నారు.